RNI NO: APTEL/25/A0108

# మహి న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

మహి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 02 సంచిక : 192, ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య , పేజీలు : 8, వెల రూ. 2, /- సోమవారం -12 - అక్టోబర్ - 2026

published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana



## సీఎంకు ఉరవకొండ అభివృద్ధి నివేదిక.. ఎమ్మెల్యేలకు చంద్రబాబు కీలక సూచన

- ఉరవకొండ అభివృద్ధి నివేదికను సీఎం చంద్రబాబుకు అందించిన మంత్రి పయ్యావుల
- నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలతో పుస్తకం రూపకల్పన
- అభివృద్ధి పనులపై ప్రజలకు ఎప్పటికప్పుడు వివరించాలని ఎమ్మెల్యేలకు సీఎం సూచన
- గత ప్రభుత్వ విధ్వంసం, తమ ప్రభుత్వ వికాసం మధ్య తేడా చెప్పాలన్న చంద్రబాబు

# పట్టణ స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు.. కీలక ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ సర్కార్

### పట్టణ స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం కొత్త జీవో జారీ

- ★ ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కలిపి 50 శాతం మించకూడదని స్పష్టీకరణ
- ★ మేయర్లు, ఛైర్‌పర్సన్లు, వార్డు సభ్యుల స్థానాలకు రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు
- ★ సుప్రీంకోర్టు 'ట్రిపుల్ టెస్ట్' ఆధారంగా రిజర్వేషన్లను ఖరారు చేసిన సర్కార్
- ★ డెడికేటెడ్ కమిషన్ సిఫార్సులకు ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు




అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో బీసీ రిజర్వేషన్లను ఖరారు చేస్తూ కూటమి ప్రభుత్వం శనివారం నూతన మార్గదర్శకాలతో ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కేటాయించే మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని ఈ జీవోలో స్పష్టంగా పేర్కొంది. సుప్రీంకోర్టు, ఏపీ హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులకు అనుగుణంగా ఈ నిబంధనను తప్పనిసరి చేసింది. ఈ మేరకు మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మిగతా 2 లో

## అమ్మవారి ఆశీస్సులతో ఏపీ సుభిక్షంగా వర్ధిల్లాలి: సీఎం చంద్రబాబు



- ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సీఎం చంద్రబాబు దసరా నవరాత్రుల శుభాకాంక్షలు
- అధర్మంపై ధర్మం గెలిచిన పండుగ దసరా అని వ్యాఖ్య
- ఇంద్రకీలాద్రి దుర్గమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్ష
- రాష్ట్రం సుభిక్షంగా, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు వెల్లడి

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు దసరా శరన్నవరాత్రుల శుభాకాంక్షలు తెలిపారు.

## ఢిల్లీలో బారికేడ్లు తొలగించండి, మెట్రో నడపండి..



### ఇంటర్నెట్‌పై ఆంక్షలు వద్దు: సుప్రీంకోర్టు

ఢిల్లీలో అనవసర బారికేడ్ల తొలగింపునకు సుప్రీంకోర్టు ఆదేశం
ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తప్ప మెట్రో, రైలు సేవలు ఆపవద్దని సూచన
శాంతియుత నిరసనకారులను అక్రమంగా నిర్బంధించరాదని స్పష్టీకరణ
నిరసనల వేళ ఆంక్షలపై దాఖలైన పిటిషన్లపై ప్రత్యేక విచారణ



## ఇంద్రకీలాద్రిపై దసరా శోభ.. బాలాత్రిపుర సుందరిగా కనకదుర్గమ్మ

ఇంద్రకీలాద్రిపై ఘనంగా ప్రారంభమైన దసరా శరన్నవరాత్రులు
తొలిరోజు బాలాత్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ
అమ్మవారి దర్శనానికి తెల్లవారుజాము నుంచే బారులు తీరిన భక్తులు
పది రోజుల పాటు పది అలంకారాల్లో భక్తులకు కనువిందు చేయనున్న దుర్గమ్మ



## రియాద్ విమానాశ్రయంపై భీకర దాడి.. 12 మంది మృతి, 300 మందికి పైగా గాయాలు

గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమం
దాడికి హౌతీ రెబల్స్ కారణమని సౌదీ కూటమి ఆరోపణ
ఇది యుద్ధ నేరమని, ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరిక
మృతుల్లో అమెరికా పౌరుడు కూడా ఉన్నట్లు ధ్రువీకరించిన యూఎస్

# చెన్నైలో కొత్త మెట్రోకు పచ్చజెండా.. తొలి ప్రయాణం చేసిన ప్రధాని మోదీ, సీఎం విజయ్

### చెన్నై మెట్రో ఫేజ్ 2లో కీలకమైన పూనమల్లి-వడపళని మార్గం ప్రారంభం

- జెండా ఊపి రైలును ప్రారంభించి ప్రధాని మోదీ, సీఎం విజయ్
- కొత్త మెట్రో రైలులో కలిసి ప్రయాణించిన ఇరువురు నేతలు
- సుమారు రూ.4,900 కోట్ల వ్యయంతో 15 కిలోమీటర్ల మేర ఈ మార్గం నిర్మాణం
- పశ్చిమ శివార్ల నుంచి నగర కేంద్రానికి తగ్గనున్న ప్రయాణ సమయం



ఢిల్లీ: చెన్నై మహానగరంలో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగు పడింది. చెన్నై మెట్రో రైల్ ఫేజ్ 2లో భాగంగా మిగతా 2 లో

# నిరసనలు ఆపొద్దు.. నేనున్నా.. యువతకు రాహుల్ గాంధీ పిలుపు

### రాజ్యాంగాన్ని కాపాడేందుకు పోరాటం కొనసాగిస్తామని వెల్లడి

అరెస్టులు చేసినా వెనక్కి తగ్గేది లేదని కేంద్రానికి సవాల్

ఢిల్లీలో నిరసనకారుల అరెస్టుల నేపథ్యంలో ఘాటు వ్యాఖ్యలు




ఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. యువత తమ నిరసనలను కొనసాగించాలని, వారికి ప్రతిపక్షం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాజ్యాంగంపై దాడి చేస్తున్న వారిని ఓడించి, మిగతా 2 లో



## ఓటు కోల్పోయిన వారిని తీసుకొస్తా..: రామచందర్‌రావుకు పొన్నం సవాల్

- ఓటు కోల్పోయిన ఒక్కరినైనా చూపించగలరా..
- రాష్ట్రంలో 70 లక్షల ఓట్లు, హైదరాబాద్‌లో 40లక్షల ఓట్లు పోయాయి
- 'సర్' పేరుతో దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది ఓట్లు తొలగించారు
- ఓటర్ల జాబితా సవరణ పేరుతో.. అర్హులైన ఓటర్లకు అన్యాయం జరగకూడదు

## రేడియల్ రోడ్డు-2 టెండర్లు రద్దు చేయండి

# సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

### తక్కువ కోట్ చేసిన వారిని తప్పించి, ఎక్కువ ధరకు పనులు అప్పగించారని విమర్శ

- ప్రాజెక్టులో భారీ అవకతవకలు జరిగాయని, ప్రభుత్వానికి రూ. 600 కోట్ల నష్టం వాటిల్లుతుందని ఆరోపణ
- టెండర్ల ప్రక్రియపై కాగ్ ఆడిట్, శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్
- రూ.3,296 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టులో కావాల్సిన కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారు



హైదరాబాద్: రాష్ట్రంలో చేపట్టిన రేడియల్ రోడ్డు-2 ప్రాజెక్టు టెండర్ల ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని, వాటిని తక్షణమే రద్దు చేసి సమగ్ర విచారణ జరిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. రూ. 3,296 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టులో కావాల్సిన కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారని ఆరోపించారు. ఔటర్ రింగ్ రోడ్డులోని బుద్వేల్ నుంచి కొడంగల్ సమీపంలోని ఎన్‌హెచ్-167ఎన్ వరకు నిర్మించ తలపెట్టిన 81.15 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే పనులను ప్యాకేజీలుగా విభజించి, మిగతా 2 లో

## ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో రాబోయే 8 నెలలు కీలకం



- ఈ 8 నెలల్లో ప్రతీ కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేయాలి
- సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- కొండమంటే విద్యుత్ లభించడం లేదు.. పొదుపుగా వాడుకోవాలి
- రాబోయే రోజుల్లో విద్యుత్ సమస్య తీవ్రతరమయ్యే ప్రమాదం ఉంది
- చేతికొచ్చిన పంటలను కాపాడేందుకు చర్యలు చేపట్టాలి
- పకడ్బందీ యాక్షన్ ప్లాన్ రూపొందించాలి

# సంపాదకీయం

## రోజూ ఈ 5 పనులు చేయండి..
## జీవితం మరింత ఆనందంగా మారుతుంది!

జీవితంలో ఏదైనా గొప్ప విజయం సాధించినప్పుడే ఆనందం కలుగుతుందని అనుకుంటాం. ఏదైనా ప్రత్యేకమైన రోజు వస్తేనే మనసుకు ఉత్సాహం వస్తుందని భావిస్తాం. కానీ రోజూ మనం చేసే చిన్నచిన్న పనుల్లోనూ ఆనందాన్ని వెతుక్కోవచ్చు. ఉదయం నిద్రలేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు కొన్ని అలవాట్లను పాటిస్తే మనసుకు ప్రశాంతత లభిస్తుంది. రోజంతా జరిగిన విషయాలను హాయిగా ఆస్వాదించగలుగుతాం. మరి, రోజువారీ జీవితాన్ని మరింత అర్థవంతంగా మార్చే ఆ ఐదు చిన్న అలవాట్లు ఏంటో తెలుసుకుందాం..

నిద్రలేవగానే ఫోన్ తీసుకుని మెసేజ్‌లు, వార్తలు, సోషల్ మీడియా చూడటం చాలామందికి అలవాటు. అలా కాకుండా ఉదయం కొన్ని నిమిషాలు మీకోసం కేటాయించండి. కిటికీ తెరిచి బయట వాతావరణాన్ని చూడండి. ప్రశాంతంగా కూర్చోండి. ఇష్టమైతే చిన్న ప్రార్థన చేసుకోండి లేదా నెమ్మదిగా శ్వాస తీసుకుంటూ ఉండండి. రోజు ప్రారంభంలోనే ఇతరుల సందేశాలు, పనుల గురించి ఆలోచించకుండా కాసేపు మీ మనసుకు విశ్రాంతి ఇవ్వండి. ఈ చిన్న మార్పు రోజంతా ప్రశాంతంగా ఉండేందుకు తోడ్పడుతుంది.

రోజంతా పని, ఇంటి బాధ్యతలతో అలసిపోతుంటాం. ఆ సమయంలో సాయంత్రం ఒక దీపం వెలిగించడం మంచి అలవాటుగా మారుతుంది. చాలామందికి ఇది ఆధ్యాత్మిక ఆచారం. మరికొందరికి రోజంతా ఎదురైన ఒత్తిడి నుంచి కాసేపు బయటపడే అవకాశంగా ఉపయోగపడుతుంది. దీపం వెలిగించినప్పుడు ఆ రోజు ఎదురైన ఇబ్బందులు, పని ఒత్తిడిని కాసేపు పక్కన పెట్టండి. జరిగిన విషయాలన్నింటినీ మనసులో పెట్టుకుని రాత్రి వరకు బాధపడకుండా ప్రశాంతంగా ఉండేందుకు ప్రయత్నించండి. ఆకలిగా ఉన్నప్పుడు భోజనం ముందు కూర్చోగానే తినడం మొదలుపెడతాం. కానీ మొదటి ముద్ద తినే ముందు కొన్ని క్షణాలు ఆగండి. ఆ భోజనం తయారు చేసిన వ్యక్తిని గుర్తు చేసుకోండి. మనకు ఆహారం అందేందుకు కష్టపడిన రైతులు, ఇతరుల శ్రమను తలచుకోండి. లేదంటే మనకు తినడానికి ఆహారం ఉన్నందుకు మనసులోనే కృతజ్ఞత చెప్పుకోండి. ఇది చిన్న విషయంలా అనిపించినా, మనం చేసే పనుల విలువను గుర్తించేందుకు సహాయపడుతుంది. రోజూ యాంత్రికంగా చేసే పనుల్లోనూ ఆనందాన్ని గుర్తించగలుగుతాం. నడక అంటే వ్యాయామం చేయడం లేదా ఫోన్‌లో పాటలు, వీడియోలు వినడం మాత్రమే కాదు. అప్పుడప్పుడు ఫోన్‌ను పక్కన పెట్టి బయట నడవండి. ఆకాశం, చెట్లు, చుట్టూ ఉన్న మనుషులు, వారి మాటలు, రోడ్డుపై వినిపించే శబ్దాలను గమనించండి. రోజూ చూసే పరిసరాలనే కొత్తగా గమనించే అవకాశం లభిస్తుంది. మనసును ప్రశాంతంగా ఉంచేందుకు ప్రతిసారీ ధ్యానం చేయాల్సిన అవసరం లేదు. మనం ఉన్న చోటును, చుట్టూ జరిగే విషయాలను శ్రద్ధగా గమనించడం కూడా మంచి అనుభూతిని ఇస్తుంది. రోజంతా ఎన్ని పనులు చేసినా, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా.. పడుకునే ముందు ఆ రోజు జరిగిన ఒక మంచి విషయాన్ని గుర్తు చేసుకోండి. ఎవరైనా ప్రేమగా మాట్లాడి ఉండొచ్చు. రుచికరమైన భోజనం చేసి ఉండొచ్చు. చాలా రోజులుగా వాయిదా వేస్తున్న పనిని పూర్తి చేసి ఉండొచ్చు. లేదంటే కాసేపు ప్రశాంతంగా గడిపి ఉండొచ్చు. రోజంతా గొప్పగా గడవకపోయినా, గుర్తుంచుకోదగిన మంచి విషయం ఒక్కటైనా ఉంటుంది. దాన్ని గుర్తు చేసుకుంటూ నిద్రపోవడం వల్ల రోజును సానుకూలంగా చూసే అలవాటు పెరుగుతుంది.

చిన్న అలవాట్లలోనే అసలైన ఆనందం!

ఈ ఐదు పనుల కోసం ఎక్కువ సమయం కేటాయించాల్సిన అవసరం లేదు. పెద్ద మార్పులు చేసుకోవాల్సిన పనీ లేదు. ఉదయం ఫోన్‌కు దూరంగా ఉండటం, సాయంత్రం దీపం వెలిగించడం, భోజనానికి కృతజ్ఞత చెప్పడం, ఫోన్ లేకుండా నడవడం, రాత్రి ఓ మంచి విషయాన్ని గుర్తు చేసుకోవడం.. ఇవన్నీ సులభంగా అలవాటు చేసుకోవచ్చు. ఈ చిన్న పనులు ఒక్కరోజులోనే జీవితాన్ని మార్చేయకపోవచ్చు. కానీ మన చుట్టూ ఇప్పటికే ఉన్న మంచి విషయాలను గుర్తించడం నేర్పుతాయి. ప్రతి రోజును మరింత ప్రశాంతంగా, ఆనందంగా గడిపేందుకు దోహదపడతాయి.

## ఓటు కోల్పోయిన వారిని తీసుకొస్తా..:
## రామచందర్‌రావుకు పొన్నం సవాల్

హైదరాబాద్: ఓటు కోల్పోయిన ఒక్కరినైనా చూపించగలరా.. అంటూ తెలంగాణ భాజపా చీఫ్ రామచందర్‌రావు చేసిన సవాల్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. ఓటు కోల్పోయిన వారిని తీసుకొస్తానని.. తేదీ, సమయం చెప్పాలని సవాల్ విసిరారు 'సర్' పేరుతో దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది ఓట్లు తొలగించారని ఆరోపించారు. రాష్ట్రంలో 70 లక్షల ఓట్లు, హైదరాబాద్‌లో 40లక్షల ఓట్లు పోయాయన్నారు. ఓటరు జాబితా సమగ్ర ప్రక్షాళనను సరిగా చేయాలని.. అంతేగానీ ఓటు కోసం కొట్లాడేవారిని దూషించడం తగదన్నారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో.. అర్హులైన ఓటర్లకు అన్యాయం జరగకూడదని పేర్కొన్నారు.

## వైసీపీ మద్దతుదారులకు ఒకటే చెబుతున్నాం: పవన్ కల్యాణ్

అమరావతి: "వైసీపీ మద్దతుదారులకు ఒకటే చెబుతున్నాం. మేం అభివృద్ధిని రాజకీయాలకు అతీతంగా చూస్తున్నాం. ఏ పార్టీ బతకాలనేది కాదు, వ్యవస్థలు బతకాలి, గ్రామాలు బాగుపడాలి, ప్రజల జీవితాలు మెరుగుపడాలి. పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు చేపట్టిన తర్వాత, వైసీపీ మద్దతు ఉన్న పంచాయతీలకు కూడా అవసరమైన నిధులు అందేలా చర్యలు తీసుకున్నాను" అని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు. ఆదివారం పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గంలోని కాకవాడ గ్రామంలో "అడవితల్లి బాట 2.0" కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. తాము బాధ్యతలు స్వీకరించాక వైసీపీ మద్దతు ఉన్న పంచాయతీలకు కూడా నిధులు విడుదల చేశామని, తమకు ప్రజల శ్రేయస్సే ముఖ్యమని తెలిపారు. ఈ సందర్భంగా రూ.2,052 కోట్ల అంచనా వ్యయంతో 2,569 అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఈ పథకం ద్వారా 1,341 గిరిజన ఆవాసాలకు 1,976 కిలోమీటర్ల మేర రహదారులు, 45 వంతెనలు నిర్మించనున్నట్లు వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం గిరిజన గ్రామాల అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ప్రజావసరాలు తీర్చాల్సిన వందల కోట్ల రూపాయల నిధులను ప్రభుత్వ భవనాలకు పార్టీ రంగులు వేయడానికి, వాటిని తొలగించడానికి దుర్వినియోగం చేసిందని తీవ్రంగా విమర్శించారు. అదే నిధులతో ఎన్నో గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించి ఉండవచ్చన్నారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తు కోసం జనసైనికులు ఎన్నో త్యాగాలు చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు అరెస్టు సమయంలోనూ రోడ్లపైకి వచ్చి పోరాడిన జనసైనికులు, వీరమహిళల త్యాగాలను మరువలేమని అన్నారు. వారి త్యాగాలకు గుర్తింపుగా, పొత్తు ధర్మాన్ని గౌరవిస్తూ రాబోయే స్థానిక ఎన్నికల్లో జనసేన కార్యకర్తలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని కూటమి నాయకులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎన్నికలు జనసైనికుల భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా ఉండాలని ఆకాంక్షించారు. గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం ఎంతో క్లిష్టమైన ప్రక్రియ అని, కొండలను తొలచి, రాక్ కటింగ్ వంటి పనులు చేయాల్సి ఉంటుందని తెలిపారు. తాము నిర్మిస్తున్న రోడ్ల నాణ్యతను స్థానిక ప్రజలే పర్యవేక్షించాలని కోరారు. ఏమైనా లోపాలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గిరిజనుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ఉద్యానవనాల అభివృద్ధి, పర్యాటక రంగ ప్రోత్సాహం, మొబైల్ కనెక్టివిటీ వంటి చర్యలు చేపడుతున్నామని వివరించారు. అటవీ అనుమతులు వేగవంతం చేసి సెల్ టవర్లు, రహదారుల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు కోరిన పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి తక్షణమే ఆదేశాలు జారీ చేశారు. అధికార అహంకారంతో ప్రజలను భయపెట్టే రోజులు పోయాయని, తప్పును ప్రశ్నించే ధైర్యంతో పాటు బాధ్యతగా వ్యవహరించాలని ప్రజలకు సూచించారు.

## తిరుమల శ్రీవారి దసరా బ్రహ్మోత్సవాల పూర్తి షెడ్యూల్ ఇదిగో!

తిరుపతి: తిరుమల పుణ్యక్షేత్రం మరో ఉత్సవానికి సిద్ధమైంది. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనున్నాయి. అధికమాసం రావడం వల్ల ఈ ఏడాది స్వామివారికి రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే భాద్రపద మాసంలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు ముగియగా, దసరా నవరాత్రులను పురస్కరించుకుని ఆశ్వయుజ మాసంలో ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. అక్టోబరు 11న అంకురార్పణతో ఈ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. సాధారణంగా చాంద్రమానం ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి అధికమాసం వస్తుంది. ఇలా వచ్చినప్పుడు కన్యామాసంలో (భాద్రపదం) వార్షిక బ్రహ్మోత్సవాలు, ఆశ్వయుజ మాసంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం తిరుమల సంప్రదాయం. ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ఒక ప్రత్యేకత ఉంది. వార్షిక బ్రహ్మోత్సవాల తరహాలో వీటికి ధ్వజారోహణం, ధ్వజావరోహణం వంటి ఘట్టాలు ఉండవు. అంకురార్పణతో నేరుగా ఉత్సవాలు ప్రారంభమై, చక్రస్నానంతో పరిసమాప్తం అవుతాయి. ఈ ఉత్సవాల్లో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఎదురుచూసే గరుడ వాహన సేవ అక్టోబరు 16న జరగనుంది. అలాగే, అక్టోబరు 17న పుష్పక విమానం, 19న స్వర్ణరథం ఊరేగింపు, 20న చక్రస్నానం ఘట్టాలు వైభవంగా జరగనున్నాయి. ప్రతిరోజూ ఉదయం వాహన సేవలు 8 గంటల నుంచి 10 గంటల వరకు, రాత్రి సేవలు 7 గంటల నుంచి 9 గంటల వరకు జరుగుతాయి. అయితే, గరుడ వాహన సేవ మాత్రం అక్టోబరు 16న సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 11.30 గంటల వరకు విశేషంగా నిర్వహిస్తారు.

### నవరాత్రి బ్రహ్మోత్సవాల పూర్తి షెడ్యూల్:

అక్టోబరు 11: అంకురార్పణం (రాత్రి 7 నుంచి 9 గంటల వరకు), అక్టోబరు 12: బంగారు తిరుచ్చి ఉత్సవం (ఉదయం 9 గంటలకు), పెద్దశేష వాహనం (రాత్రి 7 గంటలకు), అక్టోబరు 13: చిన్నశేష వాహనం (ఉదయం 8 గంటలకు), హంస వాహనం (రాత్రి 7 గంటలకు), అక్టోబరు 14: సింహ వాహనం (ఉదయం 8 గంటలకు), ముత్యపుపందిరి వాహనం (రాత్రి 7 గంటలకు), అక్టోబరు 15: కల్పవృక్ష వాహనం (ఉదయం 8 గంటలకు), సర్వభూపాల వాహనం (రాత్రి 7 గంటలకు), అక్టోబరు 16: మోహినీ అవతారం (ఉదయం 8 గంటలకు), గరుడ వాహనం (సాయంత్రం 6.30 గంటలకు), అక్టోబరు 17: హనుమంత వాహనం (ఉదయం 8 గంటలకు), పుష్పక విమానం (సాయంత్రం 4 గంటలకు), గజ వాహనం (రాత్రి 7 గంటలకు), అక్టోబరు 18: సూర్యప్రభ వాహనం (ఉదయం 8 గంటలకు), చంద్రప్రభ వాహనం (రాత్రి 7 గంటలకు), అక్టోబరు 19: స్వర్ణరథం (ఉదయం 7 గంటలకు), అశ్వ వాహనం (రాత్రి 7 గంటలకు), అక్టోబరు 20: చక్రస్నానం (ఉదయం 6 గంటలకు), అక్టోబరు 20వ తేదీన ఉదయం 6 గంటలకు శ్రీవారి పుష్కరిణిలో చక్రస్నానం మహోత్సవంతో ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగుస్తాయి. ఈ తొమ్మిది రోజుల పాటు శ్రీవారు వివిధ వాహనాలపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేయనున్నారు.

# ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో రాబోయే 8 నెలలు కీలకం

హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావంతో అంతర్జాతీయ స్థాయిలో సంక్షోభ పరిస్థితులు తలెత్తుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో తక్షణ చర్యలకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితులపై జూబ్లీహిల్స్ నివాసంలోఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. భవిష్యత్‌లో తీవ్రమైన సంక్షోభం ఎదుర్కోవాల్సిన ప్రమాదం పొంచి ఉండటంతో చేపట్టాల్సిన కార్యాచరణపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా తాగు నీరు, సాగు నీరు, వ్యవసాయం, విద్యుత్ సమస్యల విషయంలో సరైన యాక్షన్ ప్లాన్ రూపొందించాల్సిందేనని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో రాబోయే సంక్షోభాన్ని ముందుగా గుర్తించకపోతే భవిష్యత్‌లో తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. సమస్యలను ఎదుర్కొనడానికి అవసరమైన అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

రాబోయే 8 నెలలు కీలకం

ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో రాబోయే 8 నెలలు కీలకమని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ 8 నెలల్లో ప్రతీ కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేయాలని, పకడ్బందీ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంపై సినిమా, మీడియా, కళాజాతలతోపాటు వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రైతులు వేసిన పంటల పరిస్థితులను అంచనావేసి పంట చేతికొచ్చే వరకు నీటి కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. నీటి సమస్య తీవ్రతరం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, చుక్క నీరు కూడా వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

తీవ్ర విద్యుత్ సంక్షోభం ..

రాబోయే రోజుల్లో విద్యుత్ సమస్య తీవ్రతరమయ్యే ప్రమాదం ఉందని సీఎం తెలిపారు. రాష్ట్రానికి అవసరమైన విద్యుత్ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చయినా చేసేందుకు సిద్ధంగా ఉన్నా, మార్కెట్‌లో విద్యుత్ అందుబాటులో లేదన్నారు. అందుకే అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. విద్యుత్ ఆధారిత పనులను సాధ్యమైనంత వరకు తాత్కాలికంగా వాయిదా వేసుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై త్వరలో మంత్రులతో ప్రత్యేక సమావేశంలో చర్చించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు చెప్పారు. వీబీజీ రామ్‌జీ పథకంలో భాగంగా 125 రోజుల ఉపాధికి అదనంగా మరో 50 రోజుల ఉపాధి కల్పించాలని కేంద్రాన్ని కోరాలని అధికారులకు సూచించారు. అదనపు పని దినాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అవసరమైతే అఖిలపక్షం ఏర్పాటు చేసే అంశాన్ని మంత్రుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. దసరా తరువాత గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించేందుకు వార్ రూమ్ ఏర్పాటు చేయాలని, టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాను ఎప్పటికప్పుడు సీఎంఓ ఉన్నతాధికారులు పర్యవేక్షించాలన్నారు.

## అమ్మవారి ఆశీస్సులతో ఏపీ సుభిక్షంగా వర్ధిల్లాలి

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు దసరా శరన్నవరాత్రుల శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం (అక్టోబరు 11) ప్రారంభమవుతున్న నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆయన సోషల్ మీడియా వేదికగా తన సందేశాన్ని పంచుకున్నారు. దుష్టశక్తులపై దైవశక్తి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి దసరా పండుగ ప్రతీక అని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నేడు ప్రారంభమవుతున్న శరన్నవరాత్రుల్లో అమ్మవారిని తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఆరాధించడం మన సంప్రదాయంలో ఎంతో విశిష్టమైనది. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దివ్య ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలి" అని ఆకాంక్షించారు. అమ్మవారి కరుణాకటాక్షాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని, ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలని చంద్రబాబు మనస్ఫూర్తిగా కోరుకున్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తన సందేశంలో పేర్కొన్నారు. హిందూ సంప్రదాయంలో దసరా పండుగకు, శరన్నవరాత్రి ఉత్సవాలకు ఉన్న ప్రాధాన్యతను ఆయన తన మాటల్లో గుర్తుచేశారు.

## చెన్నైలో కొత్త మెట్రోకు పచ్చజెండా..
## తొలి ప్రయాణం చేసిన ప్రధాని మోదీ, సీఎం విజయ్

ఢిల్లీ: చెన్నై మహానగరంలో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగు పడింది. చెన్నై మెట్రో రైల్ ఫేజ్ 2లో భాగంగా ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పూనమల్లి–వడపళని మార్గాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ కలిసి ప్రారంభించారు. పోరూర్ బైపాస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఇరువురు నేతలు జెండా ఊపి తొలి రైలు సర్వీసును ప్రారంభించారు. అనంతరం కొత్త మెట్రో రైలులో కలిసి ప్రయాణించి, అందులోని సౌకర్యాలను పరిశీలించారు. కారిడార్ 4లో భాగంగా సుమారు రూ.4,900 కోట్ల వ్యయంతో ఈ కొత్త మార్గాన్ని నిర్మించారు. 15 కిలోమీటర్ల పొడవున్న ఈ మార్గంలో మొత్తం 11 ఎలివేటెడ్ స్టేషన్లు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులో అత్యాధునిక సాంకేతికతను వినియోగించారు. ముఖ్యంగా, కొన్నిచోట్ల డబుల్ డెక్కర్ సెక్షన్‌ను నిర్మించడం ఈ మార్గం ప్రత్యేకత. అంతేకాకుండా భవిష్యత్తులో డ్రైవర్ అవసరం లేకుండానే రైళ్లను నడపేందుకు వీలుగా ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇది రైళ్ల రాకపోకలలో కచ్చితత్వాన్ని, భద్రతను పెంచుతుంది. ఈ కొత్త మెట్రో కారిడార్ అందుబాటులోకి రావడంతో చెన్నై పశ్చిమ శివారు ప్రాంతాలైన పూనమల్లి వంటి ఏరియాల నుంచి వడపళని వంటి నగర కేంద్ర ప్రాంతాలకు ప్రయాణం సులభతరం కానుంది. రోజూ ప్రయాణించే వేలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రజలకు ప్రయాణ సమయం గణనీయంగా ఆదా అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమం ముగిసిన వెంటనే ఈ మార్గంలో ప్రయాణికుల కోసం సాధారణ సర్వీసులను కూడా ప్రారంభించారు. తమిళనాడు పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పలు ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. ఈ కొత్త మెట్రో లైన్ చెన్నై నగర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు.

## ఢిల్లీలో బారికేడ్లు తొలగించండి, మెట్రో నడపండి..
## ఇంటర్నెట్‌పై ఆంక్షలు వద్దు: సుప్రీంకోర్టు

ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో విధించిన కఠిన ఆంక్షలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. శాంతిభద్రతలు లేదా ట్రాఫిక్ సమస్యలు ఉంటే తప్ప, మిగతా అన్ని చోట్లా ఏర్పాటు చేసిన బారికేడ్లను సమీక్షించి తొలగించాలని అధికారులను ఆదేశించింది. మెట్రో, రైల్వే సేవలను యథాతథంగా కొనసాగించాలని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అత్యవసరమైతే తప్ప వాటిని నిలిపివేయరాదని నేడు జరిగిన ప్రత్యేక విచారణలో స్పష్టం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు సంబంధించిన డిమాండ్లతో నిన్న ఢిల్లీలో జరిగిన నిరసనల సందర్భంగా అధికారులు భారీ ఆంక్షలు విధించారు. పలు మెట్రో స్టేషన్లను మూసివేయడం, నిరసనకారులను అక్రమంగా అదుపులోకి తీసుకున్నారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం పలు కీలకమైన మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. చట్టబద్ధమైన నిబంధనలకు లోబడి ప్రజలు, వాహనాల స్వేచ్ఛాయుత రాకపోకలకు అనుమతించాలని స్పష్టం చేసింది. చట్ట ప్రకారం కాకుండా ఇంటర్నెట్ సేవలకు ఎలాంటి అంతరాయం కలిగించరాదని తేల్చి చెప్పింది. నిర్దిష్ట ప్రాంతాల్లో ఆంక్షలు విధించిన చోట మినహా, శాంతియుతంగా సమావేశమయ్యే వారిని అక్రమంగా నిర్బంధించకూడదని ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తన వాదనలు వినిపించింది. ఢిల్లీలో ఇంటర్నెట్ సేవలను ఇప్పటికే పునరుద్ధరించామని, మెట్రో కార్యకలాపాలు కూడా పూర్తిగా సాధారణ స్థితికి వచ్చాయని కోర్టుకు తెలియజేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, మెట్రో స్టేషన్ల మూసివేతపై వ్యక్తమైన ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని దీనిపై మరిన్ని వివరాలు సమర్పించాలని కోరుతూ తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

## పట్టణ స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు..
## కీలక ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ సర్కార్

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో బీసీ రిజర్వేషన్లను ఖరారు చేస్తూ కూటమి ప్రభుత్వం శనివారం నూతన మార్గదర్శకాలతో ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కేటాయించే మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని ఈ జీవోలో స్పష్టంగా పేర్కొంది. సుప్రీంకోర్టు, ఏపీ హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులకు అనుగుణంగా ఈ నిబంధనను తప్పనిసరి చేసింది. ఈ మేరకు మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేశ్ కుమార్ జీవో ఎంఎస్ నంబర్–251ను విడుదల చేశారు. రిజర్వేషన్ల ఖరారు కోసం సుప్రీంకోర్టు నిర్దేశించిన 'ట్రిపుల్ టెస్ట్' విధానాన్ని ప్రభుత్వం కచ్చితంగా పాటించింది. దీని కోసం గతంలో ఏర్పాటు చేసిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన సిఫార్సులకు ఆమోదం తెలిపింది. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, ఎస్‌జీఎస్‌డబ్ల్యూ డేటా ఆధారంగా పట్టణ ప్రాంతాల్లో బీసీల జనాభాను గుర్తించి, వారి రాజకీయ ప్రాతినిధ్యం కోసం ఈ రిజర్వేషన్లను కేటాయించినట్లు ప్రభుత్వం వివరించింది. రిజర్వేషన్ల కేటాయింపులో మొదట ఎస్టీలకు, ఆ తర్వాత ఎస్సీలకు, చివరగా బీసీలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, వార్డు సభ్యుల స్థానాలకు రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు వర్తింపజేయనున్నారు. 2021లో అమలు చేసిన రిజర్వేషన్ సర్కిల్‌ను ఆధారంగా తీసుకుని తదుపరి రిజర్వేషన్లను ఖరారు చేయాలని ఆదేశించారు. అయితే, పునర్విభజన జరిగిన వార్డులలో మాత్రం రిజర్వేషన్ల సైకిల్ కొత్తగా ప్రారంభమవుతుందని జీవోలో పేర్కొన్నారు. గతంలో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇచ్చిన జీవోను హైకోర్టు నిలిపివేసిన నేపథ్యంలో, న్యాయపరమైన చిక్కులు లేకుండా తాజా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్గదర్శకాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ పరిపాలన శాఖ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

## సీఎంకు ఉరవకొండ అభివృద్ధి నివేదిక..
## ఎమ్మెల్యేలకు చంద్రబాబు కీలక సూచన

అమరావతి: ఆర్థిక మంత్రి, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో అమరావతిలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తన నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించిన పుస్తకాన్ని సీఎంకు అందజేశారు. నియోజకవర్గ ప్రోగ్రెస్ కార్డు తరహాలో ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు మంత్రి పయ్యావుల తెలిపారు. ఉరవకొండకు తాగునీటి సరఫరా, హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు, కొత్త లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం, నూతన భవనాల మంజూరు వంటి పనుల వివరాలను ఇందులో పొందుపరిచినట్లు సీఎంకు వివరించారు. ఈ నివేదికను పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. మంత్రి పయ్యావులను అభినందించారు. ఇదే సమయంలో ఎమ్మెల్యేలకు కీలక సూచనలు చేశారు. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు చేయడంతో పాటు, వాటి వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసానికి, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న వికాసానికి మధ్య తేడాను ప్రజలకు స్పష్టంగా వివరించాలని తెలిపారు. ఇందుకోసం ఎమ్మెల్యేలందరూ ఇలాంటి నివేదికలు, ప్రోగ్రెస్ కార్డులను ప్రజల ముందు ఉంచాలని అభిప్రాయపడ్డారు. తన నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు, లిఫ్ట్ ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేసి సహకరిస్తున్నందుకు ముఖ్యమంత్రికి మంత్రి పయ్యావుల కేశవ్ ధన్యవాదాలు తెలిపారు.

## ఇంద్రకీలాద్రిపై దసరా శోభ..
## బాలాత్రిపుర సుందరిగా కనకదుర్గమ్మ

విజయవాడ: విజయవాడ ఇంద్రకీలాద్రిపై దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. నేటి నుంచి అక్టోబర్ 20వ తేదీ వరకు పది రోజుల పాటు కనకదుర్గమ్మ పది రకాల విశేష అలంకారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజైన నేడు అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరి దేవిగా భక్తులను అనుగ్రహిస్తున్నారు. అమ్మవారి దర్శనం కోసం తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అలంకార ప్రాముఖ్యత విషయానికి వస్తే.. పండితుల ప్రకారం, బాలాత్రిపుర సుందరి దేవి అత్యంత శక్తివంతమైన దేవత. శ్రీచక్రంలోని ప్రథమ ఆవరణలో ఈమె కొలువై ఉంటుంది. బాల మంత్రాన్ని అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. విద్యా ఉపాసకులకు ప్రప్రథమంగా ఈ మంత్రాన్నే ఉపదేశిస్తారు. బాలాత్రిపుర సుందరి అనుగ్రహం లభిస్తే మహాత్రిపుర సుందరి దేవి కటాక్షం సులభంగా సిద్ధిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. జాగ్రత్, స్వప్న, సుషుప్తి అనే మూడు అవస్థలకు అధిదేవత కాబట్టే ఆమెను 'త్రిపుర' అని పిలుస్తారు. ఈ మూడు స్థితుల్లో మనలోనే ఉంటూ విశ్వాన్ని పరిపాలిస్తుందని భక్తుల నమ్మకం. శరన్నవరాత్రుల్లో బాలాత్రిపుర సుందరి దేవి దర్శనం సంపూర్ణ ఫలదాయకమని ఆధ్యాత్మిక వేత్తలు చెబుతున్నారు.

## నిరసనలు ఆపొద్దు.. నేనున్నా..
## యువతకు రాహుల్ గాంధీ పిలుపు

ఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. యువత తమ నిరసనలను కొనసాగించాలని, వారికి ప్రతిపక్షం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాజ్యాంగంపై దాడి చేస్తున్న వారిని ఓడించి, దానిని కాపాడేందుకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. చెన్నైలో శనివారం జరిగిన "ఛాత్రోం కీ గూంజ్" విద్యార్థి కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్ఎస్ఎస్‌ను పిరికిపందలుగా అభివర్ణించిన రాహుల్.. దశాబ్ద కాలంగా వారితో పోరాడుతున్నందున వారి తీరు తనకు బాగా తెలుసన్నారు. హోంమంత్రి అమిత్ షా, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌లను ఈ కథలో "విలన్లు" అంటూ ఘాటుగా విమర్శించారు. తమ పోరాటంతో వారికి అందుబాటులో ఉన్న అవకాశాలు తగ్గిపోతున్నాయని అన్నారు. "మేం మిమ్మల్ని చుట్టుముడుతున్నాం. వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు" అని రాహుల్ గాంధీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎంతమంది పోలీసులను మోహరించినా, ప్రతిపక్ష నేతలను, యువతను అరెస్టు చేసినా తాము భయపడబోమని సవాల్ విసిరారు. ఈ మేరకు తన వ్యాఖ్యల వీడియోను 'ఎక్స్'ఖాతాలో పంచుకున్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన నిరసన నేపథ్యంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రదర్శనకు అనుమతి లేదని, 3,000 మందికి పైగా నిరసనకారులను అదుపులోకి తీసుకున్నామని ఢిల్లీ పోలీసులు తెలిపారు. అయితే, నిరసనకారులకు తన పార్టీ అండగా నిలుస్తుందని రాహుల్ స్పష్టం చేశారు.

## రియాద్ విమానాశ్రయంపై భీకర దాడి..
## 12 మంది మృతి, 300 మందికి పైగా గాయాలు

ఢిల్లీ: సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై జరిగిన భీకర దాడిలో 12 మంది ప్రాణాలు కోల్పోగా, 309 మంది గాయపడ్డారు. యెమెన్‌కు చెందిన హౌతీ రెబల్స్ ఈ దాడికి పాల్పడినట్లు సౌదీ నేతృత్వంలోని సైనిక కూటమి ఆరోపించింది. ఈ ఘటనతో విమానాశ్రయంలో కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేశారు. సౌదీ పౌర విమానయాన అథారిటీ వెల్లడించిన వివరాల ప్రకారం, మృతుల్లో నలుగురు సౌదీ పౌరులు, ఇద్దరు బంగ్లాదేశీయులు ఉన్నారు. వీరితో పాటు అమెరికా, జోర్డాన్, పాలస్తీనా, సిరియా, సూడాన్, ఈజిప్టు దేశాలకు చెందిన ఒక్కొక్కరు చొప్పున మరణించారు. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. దాడి జరిగిన వెంటనే డజనుకు పైగా అంబులెన్సులు విమానాశ్రయానికి చేరుకున్నాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. టెర్మినల్‌లోని గేట్ 401 వద్ద దాడి జరగడం చూశానని, ప్రయాణికులు భయంతో పరుగులు తీశారని ఓ ప్రత్యక్ష సాక్షి వివరించారు. ఈ దాడిని సౌదీ సైనిక కూటమి 'పూర్తిస్థాయి యుద్ధ నేరం'గా అభివర్ణించింది. ప్రయాణికులు, విమానాశ్రయ సిబ్బందిని లక్ష్యంగా చేసుకున్నారని, దీనికి తగిన రీతిలో స్పందించి ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది. ఈ దాడిలో ఒక అమెరికా పౌరుడు మరణించినట్లు యూఎస్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ మార్కో రూబియో ధ్రువీకరించారు. సౌదీపై జరుగుతున్న దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ పరిణామాల నేపథ్యంలో కువైట్ ఎయిర్‌వేస్ సహా పలు గల్ఫ్ విమానయాన సంస్థలు రియాద్‌కు తమ సర్వీసులను రద్దు చేశాయి. రియాద్‌కు రావాల్సిన అన్ని విమానాలను రద్దు చేయడం లేదా ఇతర ప్రాంతాలకు మళ్లించడం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా సౌదీ అరేబియాలోని విమానాశ్రయాలపై హౌతీల దాడులు పెరిగాయి. శనివారం దమ్మామ్‌లోని కింగ్ ఫహద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో కూడా ఒక ప్రొజెక్టైల్ పడింది. అక్టోబర్ 6, 7 తేదీల్లో జరిగిన దాడుల్లో ముగ్గురు మరణించారు. యెమెన్ అంతర్యుద్ధంలో సౌదీ అరేబియా జోక్యం చేసుకోవడం వల్లే తాము దాడులు చేస్తున్నామని హౌతీలు చెబుతున్నారు. 2022లో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం విఫలం కావడంతో యెమెన్‌లో మళ్లీ ఘర్షణలు తీవ్రమయ్యాయి. దీంతో సౌదీపై హౌతీలు క్షిపణి, డ్రోన్ దాడులను ఉద్ధృతం చేశారు.

## రేడియల్ రోడ్డు-2 టెండర్లు రద్దు చేయండి
## సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

హైదరాబాద్: రాష్ట్రంలో చేపట్టిన రేడియల్ రోడ్డు–2 ప్రాజెక్టు టెండర్ల ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని, వాటిని తక్షణమే రద్దు చేసి సమగ్ర విచారణ జరిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. రూ.3,296 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టులో కావాల్సిన కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారని ఆరోపించారు. ఔటర్ రింగ్ రోడ్డులోని బుద్వేల్ నుంచి కొడంగల్ సమీపంలోని ఎన్‌హెచ్–167ఎన్ వరకు నిర్మించ తలపెట్టిన 81.15 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే పనులను ప్యాకేజీలుగా విభజించి, తమకు అనుకూలమైన సంస్థలకు కట్టబెట్టారని కేటీఆర్ తన లేఖలో ఆరోపించారు. తక్కువ ధరకు బిడ్లు దాఖలు చేసిన వారిని అనర్హులుగా ప్రకటించి, అంచనా వ్యయం కంటే ఎక్కువ ధరకు పనులు కేటాయించడం వల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.600 కోట్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 30న బిడ్ల దాఖలుకు గడువు ముగియగా, కేవలం ఐదు పని దినాల్లోనే అంటే అక్టోబర్ 8 నాటికి టెక్నికల్ ఎవాల్యుయేషన్, అర్హతల పరిశీలన, ఫైనాన్షియల్ బిడ్ల ప్రారంభం, పనుల కేటాయింపు పూర్తి చేయడంపై కేటీఆర్ సందేహాలు వ్యక్తం చేశారు. ఇంత భారీ ప్రాజెక్టుకు సంబంధించిన 13 బిడ్లను ఇంత తక్కువ సమయంలో ఎలా ప్రాసెస్ చేశారని ప్రశ్నించారు.

ప్యాకేజీ–I పనులను ఎన్‌సీసీ లిమిటెడ్‌కు అంచనా వ్యయం కంటే 3.95 శాతం అధికంగా రూ.1,286.03 కోట్లకు కేటాయించారని, ప్యాకేజీ–II బీవీఎస్ఆర్‌కు, ప్యాకేజీ–III జీకేసీకి అప్పగించారని తన లేఖలో పేర్కొన్నారు. అంచనా వ్యయాలు, కోట్ చేసిన ధరలు, బిడ్డర్ల అనర్హతకు గల నిర్దిష్ట కారణాలు, తుది కాంట్రాక్ట్ విలువలు, టెక్నికల్ ఎవాల్యుయేషన్ నివేదికలతో సహా అన్ని రికార్డులను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. గత మూడేళ్లలో హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్ కేటాయించిన రూ.100 కోట్లకు పైబడిన కాంట్రాక్టులపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)తో ప్రత్యేక ఆడిట్ జరిపించాలని, టెండర్ల ప్రక్రియపై శ్వేతపత్రం విడుదల చేయాలని కూడా కేటీఆర్ కోరారు. కేటీఆర్ రాసిన ఈ లేఖతో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కాంట్రాక్టులలో పారదర్శకతపై రాజకీయ చర్చ మరింత తీవ్రమైంది.

## పెద్ద మాదారం గ్రామంలో ఘనంగా దుర్గామాత ఉత్సవాలు



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): మండల పరిధిలోని పెద్ద మాదారం గ్రామంలో దుర్గా మాత నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభం అయ్యాయి. దుర్గామాత అమ్మవారి ప్రతిష్టాపన కార్యక్రమం కొనసాగింది. ఉత్సవాలలో దుర్గామాత అమ్మవారి వద్ద అత్యంత భక్తి భావంతో భక్తులు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కుల మతాలకు అతీతంగా ఐక్యమత్యంగా గ్రామంలోని ప్రజలందరూ ఉత్సాహంగా దుర్గామాత ఉత్సవాలలో పాల్గొన్నారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం చోటుచేసుకుంది. ఈ కార్యక్రమంలో పరిగి మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సాయిరాం, సర్పంచ్ రాములు, మాజీ సర్పంచ్ వెంకటేష్, గ్రామ పెద్దలు ఈశ్వరప్ప, రామచంద్రరావు, నాగరాజు, ప్రతాప్, గోపాల్, రమేష్, శ్రీహరి, మహేందర్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## 16వ వార్డులో అమ్మవారికి తొలి పూజ

### - మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పరిగి ముసిపల్ పరిధిలో లోని 16 వార్డులో నవరాత్రులు సందర్భంగా అమ్మవారి పూజల పాల్గొనిమొదటి పూజ నిర్వహించిన మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్ ఈ కార్యక్రమంలో పి ఎస్ ఎస్ సి చైర్మన్ పార్థసారథి పంతులు కో ఆప్షన్ సభ్యులు పి ఎస్ ఎస్ సి డైరెక్టర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు దోమ శ్రీనివాస్ మాజీ మార్కెట్ డైరెక్టర్ యాదయ్య ప్రకాష్, రమేష్ యాదయ్య, వంశీ నిఖిల తదితరులు పాల్గొన్నారు

## కన్నులపండువగా శ్రీ దుర్గా మల్లేశ్వరుల దివ్య నగరోత్సవం



ఇంద్రకీలాద్రి, మహి న్యూస్, అక్టోబర్ 11: శ్రీ పరాభవ నామ సంవత్సర దసరా శరన్నవరాత్రి మహోత్సవాల తొలి రోజైన ఆదివారం సాయంత్రం జగన్మాత శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దివ్య నగరోత్సవం అత్యంత నేత్రపర్వంగా జరిగింది. కొండపై కొలువుదీరిన శ్రీ మల్లేశ్వర స్వామి వారి



ఆలయం (శివాలయం) నుండి ఉత్సవమూర్తుల పల్లకీ ఊరేగింపు వైభవంగా ప్రారంభమైంది. వేద పండితుల మంత్రోచ్చారణలు, సాంప్రదాయ మంగళవాయిద్యాలు, కేరళ వాయిద్యాల దివ్య ఘోష, శాక్సాఫోన్ నాదం, భక్తుల కోలాటాలు మరియు గరగ నృత్యాల నడుమ నగరోత్సవం ఆద్యంతం శోభాయమానంగా సాగింది. ఈ



ఊరేగింపులో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ,సభ్యులు, ఆలయ అధికారులు మరియు వందలాది మంది భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కొండపై నుండి బయలుదేరిన ఈ ఊరేగింపు కనకదుర్గానగర్, రథం సెంటర్, వినాయకుడి గుడి, కెనాల్ రోడ్డు మరియు ఘాట్ రోడ్డు మీదుగా భక్తుల జయజయధ్వానాల నడుమ తిరిగి కొండపైకి చేరుకుంది. అనంతరం ఇంద్రకీలాద్రిపై గల పవిత్ర అమ్మవారి రావిచెట్టు ప్రాంగణం వద్ద స్వామి, అమ్మవార్లకు సంప్రదాయబద్ధంగా విశేష పూజలు నిర్వహించి, ఆస్థాన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. దారిపొడవునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి స్వామివార్ల కృపకు పాత్రులయ్యారు.

## అమ్మవారి సన్నిధిలో వైభవంగా ఉత్సవాలు



ఇంద్రకీలాద్రి, మహి న్యూస్, అక్టోబర్ 11 : ఇంద్రకీలాద్రిపై అమ్మవారి సన్నిధిలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించడంతో పాటు, దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేశారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. ఆదివారం ఇంద్రకీలాద్రి మీడియా పాయింట్ వద్ద ఉన్నత అధికారులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు అవసరమైన తాగునీటిని నిరంతరంగా అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఉత్సవాల సమయంలో భక్తులకు ఏవైనా సమస్యలు ఎదురైతే తక్షణమే స్పందించేందుకు అధికార యంత్రాంగం 24 గంటల పాటు అందుబాటులో ఉంటుందని తెలిపారు. కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని చెప్పారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకుని ఉత్సవాల్లో పాల్గొనేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. క్యూఆర్ కోడ్ ద్వారా కూడా భక్తుల నుంచి అభిప్రాయాలు సేకరించడం జరుగుతోందని.. ఎవరైనా ఎక్కడైనా సమస్య ఉందని సమాచారం అందిస్తే యుద్ధప్రాతిపదికన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## కనకాలపేట దుర్గాదేవి ఆలయంలో 41వ శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం

### భక్తిశ్రద్ధలతో కలశస్థాపన.. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



యానం, మహి న్యూస్, అక్టోబర్ 12: యానాం శివారు కనకాలపేట గ్రామంలో కొలువై ఉన్న శ్రీ దుర్గాదేవి ఆలయంలో 41వ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీ దుర్గాదేవి అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగనున్నాయి. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ కోణంభట్ల



శ్రీరామచంద్రమూర్తి సాయి సతీష్ శర్మ బ్రహ్మత్వంలో వేదమంత్రోచ్చారణల నడుమ కలశస్థాపన పూజలు నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. కనకాల నరసింహమూర్తి (నాని), దుర్గాభవాని దంపతులు కలశస్థాపన పూజల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభం సందర్భంగా పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువత, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# భూమిని తాకనున్న సౌర తుపాను!



ఒకటి కాదు.. రెండు శక్తిమంతమైన తుపాన్లు భూమిని ఢీకొట్టనున్నాయి! సముద్రాల అల్పపీడనాలతో పుట్టినవి కాదులెండి.. మన సహజ నక్షత్రం సూర్యుడిపై పేలుళ్ల ఫలితమిది. మనకేమైనా ముప్పా? ప్రాణాలకొచ్చిన భయమేమీ లేదు కానీ.. ఆస్తుల విషయం మాత్రం అంత గ్యారంటీగా చెప్పలేము! విషయం ఏమిటంటే... సూర్యుడిపై రెండు భారీ పేలుళ్లు లాంటివి సంభవించాయి. ఫలితంగా అక్కడ సలసల కాగుతున్న పదార్థం కాస్తా ఉవ్వెత్తున ఎగసిపడింది. కరోనల్ మాస్ ఎజెక్షన్స్ అంటారు వీటిని. కిలోమీటర్ల ఎత్తుకు ఎగసే ఈ పదార్థం అక్కడి కణాలకు విద్యుదావేశాన్ని అందిస్తుంది. ఈ కణాలు కాస్తా లక్షల కిలోమీటర్లు దాటుకుని ఆదివారం భూ వాతావరణాన్ని చేరనున్నాయి. భూమి అయస్కాంత క్షేత్రాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తే మాత్రం.. కక్ష్యల్లో తిరుగుతున్న ఉపగ్రహ వ్యవస్థలు, భూమ్మీద ఉన్న విద్యుత్తు గ్రిడ్లకు సమస్యలొచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ సౌర తుపానుల వల్ల నష్టం కచ్చితంగా జరుగుతుందా? అంటే స్పష్టమైన సమాధానం మాత్రం లేదు. సూర్యుడి నుంచి వెలువడ్డ పదార్థంతో భూ అయస్కాంత క్షేత్రం ఎలా ప్రభావితమవుతుందన్న అంశంపైనే మొత్తం ఆధారపడి ఉందంటున్నారు శాస్త్రమేత్తలు. ఆదివారం భూమిని తాకనున్న భూఅయస్కాంత తుపాను జీ2 స్థాయిది అని అమెరికా నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫరిక్ అడ్మినిస్ట్రేషన్ (నోవా) తెలిపింది. భూకంపాల మాదిరిగా సౌర తుపానులను కొలిచే ఈ లెక్కలో జీ1 నుంచి జీ5 వరకూ స్థాయిలున్నాయి. దీన్నిబట్టే ఈ తుపానులు భూమిపై చూపే ప్రభావం ఉంటుంది. జీ2 స్థాయి తుపాను వల్ల కొన్ని ఉపగ్రహాలకు ఇబ్బంది ఏర్పడొచ్చు. అలాగే రేడియో కమ్యూనికేషన్స్, జీపీఎస్ వంటి నావిగేషన్ వ్యవస్థలపైనా ప్రభావం చూపవచ్చు.

### రకరకాల తుపానులు

సౌర తుపానులు కరోనల్ మాస్ ఎజెక్షన్స్‌తోపాటు ఇతర కారణాల వల్ల కూడా సంభవించవచ్చు. సూర్యుడిపై అయస్కాంత క్షేత్రంలో మార్పులు, సన్ స్పాట్స్ (అయస్కాంత క్షేత్రం బలంగా ఉన్న చిన్న చిన్న మచ్చల్లాంటి ప్రాంతాలు), సూర్యుడి నుంచి విడుదలయ్యే విపరీతమైన శక్తులు కూడా సౌర తుపానులు కారణాలవుతూంటాయి. కరోనల్ మాస్ ఎజెక్షన్ దిశ భూమివైపు ఉన్నప్పుడు వచ్చే సౌర తుపాను కక్ష్యల్లోని ఉపగ్రహాలపై ప్రభావం చూపుతూంటుంది. రేడియో ధార్మిక పదార్థంతో వచ్చే సౌర తుపానులను ఎస్1 -- ఎస్5 అని వర్గీకరిస్తే, రేడియో తరంగాలను పూర్తిగా అడ్డుకునే సౌర తుపానులను ఆర్1-- ఆర్5లుగా వర్గీకరించారు. నోవా అంచనాల ప్రకారం అక్టోబరు 7, 8వ తేదీల్లో సూర్యుడి సమీపం నుంచి రెండు విద్యుదావేశిత సౌర తుపానులు వెలువడ్డాయి. మొదటిదానితో పోలిస్తే రెండోది వేగంగా కదులుతోంది. భూమిని చేరేలోపు రెండూ



కలసిపోతాయని అంచనా. భూమిపై వీటి ప్రభావం ఓ మోస్తరుగా ఉండవచ్చునని నోవా చెబుతోంది. భూ అయస్కాంత క్షేత్రాన్ని తాకేటప్పుడు మాత్రమే అందులోని పదార్థాల ధర్మాల ఆధారంగా తీవ్రతను నిర్ణయించగలమని నోవా చెబుతోంది. జీ2 స్థాయి సౌర తుపాను ప్రభావం అధిక అక్షాంశాల ప్రాంతంలోనే ఎక్కువగా ఉంటుందని అంచనా. అంటే... ధ్రువ ప్రాంతాల్లో వోల్టేజీలో తేడాలు నమోదు కావచ్చు. ఉపగ్రహాల్లో చిన్న చిన్న మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఏర్పడవచ్చు. కొన్ని ప్రాంతాల్లో రేడియో సంకేతాలు బలహీనపడతాయి. ఉపగ్రహ నావిగేషన్ కచ్చితత్వంలోనూ తేడాలొస్తాయి. అదే సమయంలో ధృవ ప్రాంతాల్లో ఆకాశం రంగులతో మెరిసిపోవడాన్ని (అరోరా బోరియాలిస్) కూడా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. భూమధ్య రేఖకు దగ్గరగా ఉన్న భారతదేశంపై మాత్రం ఆదివారం నాటి సౌర తుపానుల ప్రభావం దాదాపుగా శూన్యం!

# మావోయిస్టు ఉద్యమం తర్వాత.. జెన్-జీ కొత్త పోరాటం!




దశాబ్దాల పాటు భారత రాజకీయ, సామాజిక పరిణామాలను ప్రభావితం చేసిన మావోయిస్టు ఉద్యమం ముగింపు కొత్త తరహా యువజన చైతన్యానికి దారితీస్తోందా? హింసాత్మక పోరాటాల స్థానంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, విద్య, ఉద్యోగాలు, ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం వంటి అంశాలపై జెన్-జీ ప్రశ్నిస్తోందా? మావోయిస్టు ఉద్యమం తర్వాత ఏర్పడిన ఈ కొత్త సామాజిక చైతన్యం కేవలం యువత ఆగ్రహానికి ప్రతిబింబమా లేక పూలే-అంబేద్కర్-కాన్షీరాం సామాజిక న్యాయ భావజాలానికి ఆధునిక కొనసాగింపా? ఈ పరిణామం భారత ప్రజాస్వామ్యంలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతోందా?

### చరిత్రలో కీలకం.. మావోయిస్టు ఉద్యమం!

భారతదేశ చరిత్ర అనేది రాజులు, రాజ్యాలు, యుద్ధాల చరిత్ర మాత్రమే కాదు.. సామాజిక అసమానతలు, భూస్వామ్య ఆధిపత్యం, కుల వివక్ష, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా సాగిన ప్రజా పోరాటాల చరిత్ర. ఈ చరిత్రలో మావోయిస్టు ఉద్యమం కూడా ఒక కీలక అధ్యాయంగా నిలిచింది. భూమి, శ్రమ, సమానత్వం, సామాజిక న్యాయం వంటి ఆశలను ముందుకు తెచ్చిన ఈ ఉద్యమం దశాబ్దాల పాటు భారత సామాజిక, రాజకీయాల్లో చర్చకు దారి తీసింది. అయితే దాని ప్రయా ణంలో అణగారిన వర్గాల ఆకాంక్షలు, యువత పాత్ర, నాయకత్వ స్వరూపంపై అనేక ప్రశ్నలు కూడా ఉత్పన్నమయ్యాయి.. ఇందుకు ప్రధాన కారణం ఈ ఉద్యమం అగ్రకుల నాయకత్వం - అట్టడుగు వర్గాల భాగస్వామ్యంతో నడవడమే అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు..

### మావోయిస్టు ఉద్యమం ముగింపు కాగానే..

మావోయిస్టు ఉద్యమాన్ని అంతమొందించడానికి కేంద్రం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'తో అగ్రకుల మావోయిస్టు నాయకత్వం సరెండర్ అయితే అణగారిన హిడ్మా వంటి ఎంతోమంది బహుజనులు బలి పీఠమెక్కారు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ ద్వారా మావోయిస్టు సాయుధ ఉద్యమాన్ని 2026 మార్చి 31 నాటికి అంత మొందించారు. అయితే అంతమైన కొన్ని రోజులకే జెన్ జీ పోరాటం నీట్ ఉద్యమం రూపంలో జూన్ 6 నుంచి బయలుదేరింది. ఇప్పుడు నిర్భయంగా బీసీ-ఎస్సీ-ఎస్టీలు, ప్రజాస్వామ్య అగ్రవర్ణ యువత ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్నారు..

### సీజేపీ డిజిటల్ ఉద్యమం వేగంగా..

దశాబ్దాల మావోయిస్టు ఉద్యమం ముగియడంతో ఆధునిక జెన్-జీ ప్రజాస్వామ్య తిరుగుబాటు మొదలైంది. 2026 మే15న భారత ప్రధాన న్యాయమూర్తి నిరుద్యోగ యువతపై 'కాక్రోచ్', 'పరాన్నజీవులు' అనే వ్యాఖ్యలు చేయడం, అనంతరం అభిజిత్ దీప్కే నాయకత్వంలో 'కాక్రోచ్ జనతా పార్టీ' అనే డిజిటల్ ఉద్యమం వేగంగా వెలుగులోకి వచ్చింది. ఇదీ జెన్-జీ యువతలో ప్రశ్నించే తత్వాన్ని, ప్రజాస్వామ్య చైతన్యాన్ని, వ్యవస్థను జవాబుదారిగా నిలబెట్టాలనే ఆకాంక్షను ముందుకు తీసుకెళ్లింది. అయితే ఈ జెన్-జీ ఉద్యమం ఆవిర్భావాన్ని కేవలం ఆ న్యాయమూర్తి వ్యాఖ్యలకు పరిమితం చేయలేం.. ఇప్పటికే దేశం ఎదుర్కొంటున్న అనేక సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలు, యువతలో పెరుగుతున్న ఆగ్రహం వంటి దీర్ఘకాలిక పరిస్థితులే ఈ చైతన్యానికి పునాది వేశాయి. ఈ పోరాటంలో బీసీ-ఎస్సీ-ఎస్టీలు, ప్రజాస్వామ్య అగ్రవర్ణ యువత తమ హక్కులు, ఆత్మగౌరవం, సమానత్వం, ప్రాతినిధ్యం కోసం సంఘటితం అయ్యారు..

### జాతీయ స్థాయిలో చర్చ!

ఈ చైతన్యం విద్యార్థుల భవిష్యత్తు, పరీక్షా వ్యవస్థలో పారదర్శకత, ఉద్యోగ అవకాశాలు, ప్రభుత్వ విద్య, వైద్య వ్యవస్థను బలోపేతం చేయాలనే ప్రశ్నలను ప్రజా వేదికలపై పెట్టింది. దాదాపు 22 లక్షలకు పైగా విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నీట్ వివాదంపై జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనలు విద్యావ్యవస్థలో జవాబుదారీతనం, పారదర్శకతపై జాతీయ స్థాయిలో చర్చ జరిగింది. ఇదే సమయంలో 'స్కూల్ రీక్ కరో' వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యపై ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ప్రభుత్వాలను కదిలిస్తున్నారు. ఇప్పుడు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఓటు హక్కు, ఎన్నికల కమిషన్, సర్ ప్రక్రియపై సీజేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న జెన్ జీ పోరాటం తీవ్రరూపం దాల్చుతోంది.

### నవ నూతన విప్లవ దశ..

ఇప్పుడు మావోయిస్టు ఉద్యమం అంతం కావడంతో యువశక్తి రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, విద్య, ఓటు హక్కు, ప్రాతినిధ్యం కోసం భయం లేకుండా రోడ్డెక్కుతున్నారు.. తమ భవిష్యత్తు గురించి స్వేచ్ఛగా మాట్లాడుతున్నారు.. భారత రాజ్యాంగమే భావజాలంగా, సామాజిక న్యాయమే లక్ష్యంగా, ఐక్యతే ఆయుధంగా జెన్‌జీ తరం కొత్త ప్రజాస్వామ్య ఉద్యమాన్ని నిర్మిస్తోంది. కావున నేటి జెన్-జీ ఉద్యమాన్ని సాంప్రదాయ యువత పోరాటంగానే చూడడం కాదు, నిజమైన, నికార్సైన సామాజిక చైత న్యానికి ప్రతీకగా చూడాల్సిన అవసరం ఉంది. భారత రాజ్యాంగాన్ని సంపూర్ణంగా అమలు చేయాలనే ఆకాంక్ష, మండల్ కమిషన్ సామాజిక న్యాయ ఉద్యమం కొన సాగింపుగా ఇది కొత్త రూపాన్ని సంతరించుకుంటోంది. అందుకే దీనిని సామాజిక న్యాయ పోరాటంలో నవ నూతన విప్లవ దశగా చూడవచ్చు.

### సామాజిక న్యాయంకై పోరాటం..

మెజార్టీ బీసీ-ఎస్సీ- ఎస్టీ యువత మావోయిస్టు ఉద్యమం వల్ల విముక్తి లభిస్తుందని విశ్వసించారు. కానీ ఆ ఉద్యమంలో చేరినవారు రాత్రింబవళ్లు అడవుల్లో చావుకు తెగించి బతి కారు. వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు సైతం భయం గానే జీవించారు.. మరోవైపు సమాజంలో అరాచకాలు, అన్యాయాలను ఎదిరించడానికి యువత పూనుకున్నా.. మావో యిస్టు అనే ముద్ర వేస్తారని వెనకడుగు వేశారు.. అయితే ఈ ఉద్యమం ద్వారా అగ్రకులాలు మాత్రమే నిర్భయంగా ఉన్నారు. వారికే మేలు జరిగింది. ఎందుకంటే వారి అన్యాయాలను ప్రశ్నించిన బీసీ-ఎస్సీ-ఎస్టీ యువత, విద్యార్థులు, మేధావులపై "మావోయిస్టు", "అర్బన్ మావోయిస్టు" వంటి ముద్రలు వేసి ఇబ్బందులకు గురిచేశారు.. మావోయిస్టు ఉద్యమ కాలంలో హింసాత్మక సంఘర్షణల మధ్య యువశక్తి సామర్థ్యం నిర్వీర్యమైపోయింది.

# ప్రమోషన్ కోసం పాతికేళ్ల నిరీక్షణ!

విద్యాబోధనలో కీలక పాత్ర పోషిస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్‌జీటీ) ఉద్యోగ జీవితంలో మాత్రం ఎదుగుదల కరువైంది. మారుమూల గ్రామాలు, తండాల్లో ఏళ్ల తరబడి సేవలందిస్తున్నా.. పదోన్నతి కోసం పాతికేళ్లకు పైగా ఎదురు చూడా ల్సిన పరిస్థితి నెలకొంది. చివరకు ప్రమోషన్ వచ్చినా ఆశించిన స్థాయిలో ఆర్థిక ప్రయోజనాలు దక్కడం లేదు.. దశాబ్దాల సర్వీస్‌కు గుర్తింపుగా కనీసం 30 ఏళ్ల ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కేల్ అయినా కల్పించాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. రాష్ట్రంలో ఎస్‌జీటీలుగా దాదాపు 40 వేల మంది వరకు పనిచేస్తున్నారు.. మిగతా ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగంలో చేరిన ఐదేళ్లకో, పదేళ్లకో, పదిహేనేళ్లకో పైస్థాయి పోస్టులకు పదోన్నతులు లభిస్తుంటే.. విద్యా శాఖలో ఎస్‌జీటీలకు మాత్రం ఒక ప్రమోషన్ కోసం 25 నుంచి 30 ఏళ్ల పాటు ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. ఎస్‌జీటీగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన వారు ఉద్యోగ విరమణకు చేరువయ్యే వరకు అదే పోస్టులో కొనసాగాల్సి రావడం దురదృష్టకరం. 2000 సంవత్సరంలో ఎస్‌జీటీగా నియామకమైన వేలాది మంది ఇప్పటికీ అదే పోస్టులో కొనసాగుతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు..

### ప్రమోషన్ ఆలస్యం.. వేతన ప్రయోజనాల్లోనూ నష్టం!

2002 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఎస్‌జీటీలు 2002 అక్టోబర్ 17న విధుల్లో చేరారు. ఈ ఏడాది అక్టోబర్ 16 నాటికి వారికి దాదాపు 24 ఏళ్ల సర్వీస్ పూర్తవుతుంది. ఇంత సుదీర్ఘ సేవ చేసినా పలువురికి ఇప్పటికీ పదోన్నతులు లభించలేదు.. ఎస్‌జీటీల సమస్య కేవలం ప్రమోషన్ రాకపోవడానికే పరిమితం కాదు. 24 ఏళ్ల సర్వీస్ పూర్తయి ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కేల్ పొందిన తర్వాత ప్రమోషన్ వస్తే ఎఫ్ఆర్ 22(బి) వర్తించదు. దీంతో రెండు ఇంక్రిమెంట్లకు బదులు ఒక్క ఇంక్రిమెంట్ మాత్రమే లభిస్తుంది. అంతేకాకుండా, ప్రమోషన్ పొందిన కొత్త పోస్టులో మళ్లీ ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ ప్రయోజనాలు పొందే అవకాశం ఉండదు. 6, 12, 18, 24 ఏళ్ల సర్వీస్‌కు లభించే ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కేళ్లు ఉద్యోగులకు కీలకం. 24 ఏళ్ల స్కేల్ పొందిన తర్వాత ప్రమోషన్ వస్తే కొత్త పోస్టులో ఈ ప్రయోజనాలు లేకపో వడంతో దీర్ఘకాలికంగా ఆర్థిక నష్టం కలుగుతోంది.



### ఏపీలో కాస్త మెరుగైన పరిస్థితి!

ఎస్‌జీటీలు సర్వీస్ పరంగా మూడు ప్రధాన సమస్యలు ఎదుర్కొంటున్నారు.. 25-30 ఏళ్ల సర్వీస్ చేసినా ప్రమోషన్ రాకపోవడం, 24 ఏళ్ల స్కేల్ తర్వాత ప్రమోషన్ వస్తే ఎఫ్ఆర్ 22(బి) కింద రెండు ఇంక్రిమెంట్ల ప్రయోజనం లేకపోవడం, ప్రమోషన్ పొందిన పోస్టులో మళ్లీ ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కేళ్లు లభించక పోవడం. దీంతో ఏళ్ల తరబడి ప్రమోషన్ కోసం ఎదురుచూసినా, పదోన్నతి వచ్చిన తర్వాత కూడా ఆశించిన ఆర్థిక ప్రయోజనం దక్కడం లేదు. అయితే 24 సంవత్సరాల స్కేల్ పొందిన తర్వాత కూడా ఎఫ్ఆర్ 22(బి) వంటి వేతన ప్రయోజనాలు, పై పోస్టులో ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్‌కు సంబంధించిన ప్రయోజనాలు లభించే విధానం ఏపీలో ఉంది. ఏపీలో 30 సంవత్సరాల సర్వీస్‌కు కూడా ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కేల్ అందుబాటులో ఉండటం అక్కడి ఎస్‌జీటీలకు ఊరట కలిగిస్తోంది. ఎస్‌పీపీ-1ఏ, ఎస్‌పీపీ-1బీ తరహాలోనే ఎస్‌పీపీ-2ఏ, ఎస్‌పీపీ-2బీ ప్రయోజనాలు అందుబాటులో ఉండటం వల్ల సుదీర్ఘకాలం ఒకే పోస్టులో పనిచేసే ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనం కలుగుతోంది. తెలంగాణలో మాత్రం 24 సంవత్సరాల స్కేలే గరిష్ట ప్రయోజనంగా ఉన్న నేపథ్యంలో దీర్ఘకాల సర్వీస్ చేసిన ఎస్‌జీటీలకు ఇక్కడ అన్యాయం జరుగుతోంది.

### 30 ఏళ్ల సర్వీసుకు స్కేల్ ఇవ్వాలి!

ఈ నేపథ్యంలో తెలంగాణలోనూ 30 ఏళ్ల సర్వీస్‌కు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కేల్ మంజూరు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నాయి.. ప్రస్తుతం 6, 12, 18, 24 ఏళ్లకు ఉన్న స్కేళ్లతో పాటు 30 ఏళ్ల సర్వీస్‌కు కూడా స్కేల్ ఇస్తే, దీర్ఘకాలంగా ఒకే పోస్టులో పనిచేస్తున్న ఎస్‌జీటీలకు ప్రమో షన్ ఆలస్యమైనా వేతన వృద్ధి ఆగకుండా ఉంటుంది. ప్రస్తుతం ఎస్‌జీటీల ఆశలు పీఆర్సీ కమిషన్ సిఫారసులపైనే ఉన్నాయి. 30 ఏళ్ల సర్వీస్‌కు కూడా ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కేల్ ఇవ్వాలన్న డిమాండ్‌ను ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పీఆర్సీ ముందు బలంగా వినిపించాయి. కమిషన్ ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలించి ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరుతున్నారు.

### ప్రమోషన్ కోసం ఎదురు చూడొద్దు!

అదే సమయంలో ఎస్‌జీటీలు 25-30 ఏళ్ల పాటు ప్రమోషన్ కోసం ఎదురుచూసే పరిస్థితికి ముగింపు పలకాలి. గతంలో ఇచ్చిన హామీ మేరకు 10,000 ఎస్‌జీటీ పోస్టులను ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులుగా అప్‌గ్రేడ్ చేసి వెంటనే పదోన్నతులు కల్పించాలి. దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యారంగానికి సేవలందిస్తున్న ఎస్‌జీటీలకు కనీసం 30 ఏళ్ల ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కేల్ మంజూరు చేస్తే వారి ఆవేదనకు కొంత ఉపశమనం లభి స్తుంది. ఇన్నేళ్ల సేవకు గుర్తింపుగా ఈ డిమాండ్‌పై ప్రభు త్వం సానుకూలంగా స్పందించాలని కోరుతున్నారు.

# రైల్వే ఉద్యోగాల పేరుతో రూ.40 లక్షల టోకరా!

## ఉరవకొండ రెండేళ్ల అభివృద్ధి నివేదికను సీఎంకు అందజేసిన మంత్రి పయ్యావుల కేశవ్

### నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలకు కలిగిన ప్రయోజనాలపై ప్రత్యేక పుస్తకం



అనంతపురం, అక్టోబర్ 11: (మహి న్యూస్): ఉరవకొండ నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరిస్తూ రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని రాష్ట్ర ఆర్థిక మంత్రి, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అందజేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులు, ప్రజలకు చేకూరిన ప్రయోజనాలను ఈ పుస్తకంలో సమగ్రంగా పొందుపరిచినట్లు మంత్రి వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన ప్రగతి నివేదికగా, ప్రోగ్రెస్ కార్డుగా ఈ పుస్తకం ఉపయోగపడుతుందని తెలిపారు. ఉరవకొండకు తాగునీటి సదుపాయం, హంద్రీ-నీవా కాలువ వెడల్పు వల్ల రైతులకు కలిగిన ప్రయోజనాలు, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం, నూతన ప్రభుత్వ భవనాల మంజూరు తదితర అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ఇందులో పొందుపరిచినట్లు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు వాటి పురోగతి, ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసానికి, కూటమి ప్రభుత్వంలో కొనసాగుతున్న అభివృద్ధికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు తెలియజేసేలా ఎమ్మెల్యేలు అభివృద్ధి నివేదికలు, ప్రోగ్రెస్ కార్డులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని అభిప్రాయపడ్డారు. ఉరవకొండ నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ వివిధ అభివృద్ధి పనులు, సాగునీటి లిఫ్ట్ ప్రాజెక్టుల మంజూరుకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మంత్రి పయ్యావుల కేశవ్ కృతజ్ఞతలు తెలిపారు.



## కాలువలు, బావుల్లో ఈతకు వెళ్లవద్దు

### పిల్లల భద్రతపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి



అనంతపురం, అక్టోబర్ 11: (మహి న్యూస్): పాఠశాలలు, కళాశాలలకు సెలవుల నేపథ్యంలో పిల్లలు, యువకులు కాలువలు, బావులు, చెరువులు, వంకలు, రిజర్వాయర్లు, ఇతర నీటి వనరుల్లో ఈత కొట్టడానికి వెళ్లవద్దని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచనల మేరకు తల్లిదండ్రులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. ముఖ్యంగా వర్షాకాలంలో కాలువల్లో నీటి ప్రవాహ వేగం, లోతు, అడుగు భాగంలోని పరిస్థితులు తెలియక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. బావుల వద్ద జారిపడటం, నీటిలో మునిగిపోవడం వంటి ఘటనలు ప్రాణాపాయానికి దారితీయవచ్చని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లలను ఒంటరిగా నీటి వనరుల వద్దకు వెళ్లనివ్వకూడదని, ఈత కొట్టడానికి లేదా నీటిలో ఆడుకోవడానికి వెళ్లకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కాలువల గట్లు, బావుల సమీపంలోని జారుడు ప్రదేశాల్లో ఆడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో సెల్ఫీలు తీసుకోవడం, నీటిలోకి దూకడం, సాహసాలు చేయడం పూర్తిగా నివారించాలని చెప్పారు. చిన్నారులకు నీటిలో మునిగిపోవడం వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు తమ పరిసరాల్లోని పిల్లలు, యువకులు ప్రమాదకర నీటి వనరుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. కాలువలు, బావుల వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు అధికారులకు సహకరించాలని తెలిపారు. ఎవరైనా నీటిలో మునిగిపోతున్నట్లు కనిపిస్తే వెంటనే అత్యవసర సహాయం కోరాలని, శిక్షణ లేకుండా నీటిలోకి దూకి రక్షించేందుకు ప్రయత్నించకూడదని స్పష్టం చేశారు. "కాలువల్లో ఈత వద్దు.. బావుల్లోకి దిగవద్దు.. మీ ప్రాణాలను కాపాడుకోండి.. మీ కుటుంబానికి విషాదాన్ని దూరం చేయండి" అని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సూచనలను ప్రతి ఒక్కరూ పాటించి, ఇతరులకు కూడా తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పీజీఆర్ఎస్‌పై క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి

### ప్రజలకు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ పిలుపు




అనంతపురం, అక్టోబర్ 11: (మహి న్యూస్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందుతున్న సేవలపై ప్రజలు తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ కోరారు. పీజీఆర్ఎస్ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచడంతో పాటు ప్రజల సంతృప్తి స్థాయిని మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా, మండల స్థాయి పీజీఆర్ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నోటీసు బోర్డులు, హెల్ప్ డెస్క్‌లు, ఫిర్యాదుల కౌంటర్ల వద్ద కూడా క్యూఆర్ కోడ్‌లను అందుబాటులో ఉంచాలని సూచించారు. పీజీఆర్ఎస్ సేవలు పొందిన వెంటనే ప్రజలు తమ మొబైల్ ఫోన్లతో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అభిప్రాయాలను నమోదు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రజల స్పందన అధికారిక పీజీఆర్ఎస్ పోర్టల్‌కు చేరుతుందని పేర్కొన్నారు. అర్జీల స్థితిగతులను తెలుసుకోవడానికి టోల్ ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేయవచ్చని సూచించారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌తో పాటు మండల కార్యాలయాల్లో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో ప్రజలు తమ అర్జీలను సమర్పించాలని, సేవలపై తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేసి మరింత మెరుగైన సేవలు అందించేందుకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### పీజీఆర్ఎస్‌తో పాటు రెవెన్యూ క్లినిక్, న్యాయ సేవల క్లినిక్ ఏర్పాటు



అనంతపురం, అక్టోబర్ 11: (మహి న్యూస్): అనంతపురం జిల్లా కలెక్టరేట్‌లో అక్టోబర్ 12వ తేదీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను వివరాలతో సహా సమర్పించాలని కలెక్టర్ సూచించారు. గతంలో అర్జీలు ఇచ్చినవారు సంబంధిత రసీదులను వెంట తీసుకురావాలని, అర్జీలలో వివరాలను సరిగ్గా నమోదు చేయాలని తెలిపారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్‌కు సందేశం వస్తుందని, నోటీసులు, ఎండార్స్‌మెంట్లు వాట్సాప్ ద్వారా లేదా రిజిస్టర్డ్ పోస్టు ద్వారా పంపిస్తామని పేర్కొన్నారు. అర్జీల స్థితిగతులను తెలుసుకోవడానికి, పరిష్కారం కాని ఫిర్యాదులపై సమాచారం పొందడానికి మీకోసం టోల్ ఫ్రీ కాల్ సెంటర్ నంబర్ 1100ను సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు. [Meekosam.ap.gov.in] (https://meekosam.ap.gov.in) వెబ్‌సైట్ ద్వారా కూడా అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. రెవెన్యూ పరిధిలోని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాల్లో "మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100" అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రజలకు న్యాయపరమైన సమస్యలపై సలహాలు, అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో లీగల్ సర్వీసెస్ క్లినిక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో ప్యానెల్ న్యాయవాది, పారా లీగల్ వాలంటీర్ ద్వారా న్యాయపరమైన మార్గదర్శకత్వం అందిస్తారని పేర్కొన్నారు. సోమవారం డివిజన్, మండల, ఎస్‌జీఎస్‌డబ్ల్యూ స్థాయిల్లోనూ పీజీఆర్ఎస్ నిర్వహించాలని ఆర్డీఓలు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులకు సూచించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మాజీ ఎస్ఐ మధుపై బాధితుల తీవ్ర ఆరోపణలు

### ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదు చేసేందుకు సిద్ధం



అనంతపురం బ్యూరో, మహి న్యూస్ అక్టోబర్ 11: రైల్వే ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి సుమారు రూ.40 లక్షలు వసూలు చేసినట్లు ఆదోనిలో గతంలో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన మధుపై ఆరోపణలు వెల్లువెత్తాయి. అనంతపురం జిల్లాకు



చెందిన నలుగురు బాధితులు తమ వద్ద ఉన్న ఆధారాలతో ఈ వ్యవహారాన్ని వెలుగులోకి తెచ్చేందుకు సిద్ధమయ్యారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల విచారణ జరగాల్సి ఉంది.

### ఉద్యోగాల ఆశ చూపి డబ్బులు వసూలు చేశారా?

అనంతపురం జిల్లా కుందుర్పి మండలం అప్పిలేపల్లి గ్రామానికి చెందిన మధు, ఆదోని పోలీస్ స్టేషన్‌లో 2023--24 సమయంలో ఎస్ఐగా పనిచేసినట్లు బాధితులు చెబుతున్నారు. ఆ సమయంలో వెలువడిన రైల్వే గ్రూప్-డి ఉద్యోగాల నోటిఫికేషన్‌ను ఆసరాగా చేసుకుని, రైల్వే శాఖలోని ఉన్నతాధికారుల పరిచయాలతో ఉద్యోగాలు ఇప్పించగలనని నమ్మించినట్లు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో అనంతపురానికి చెందిన నలుగురి నుంచి విడివిడిగా డబ్బులు తీసుకుని, మొత్తం సుమారు రూ.40 లక్షలు వసూలు చేసినట్లు బాధితులు పేర్కొంటున్నారు.

### ఉద్యోగాలు రాలేదు.. డబ్బులు తిరిగి ఇవ్వలేదని ఆరోపణలు

డబ్బులు చెల్లించి చాలాకాలం గడిచినా ఉద్యోగాలు రాకపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. తమ సొమ్ము తిరిగి ఇవ్వాలని కోరినప్పుడల్లా త్వరలో చెల్లిస్తానంటూ కాలయాపన చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. వడ్డీతో సహా డబ్బులు తిరిగి చెల్లిస్తానని హామీ ఇస్తూ ప్రామిసరీ నోట్లు రాసిచ్చినట్లు బాధితులు చెబుతున్నారు. అయినప్పటికీ తమకు డబ్బులు అందలేదని, ప్రస్తుతం ఆయన ఆచూకీ తెలియడం లేదని వాపోతున్నారు.

### పోలీసు హోదాను ఉపయోగించుకున్నారా?

ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు శాఖలో పనిచేసిన వ్యక్తిపై ఇలాంటి ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది. తన హోదా, పరిచయాలను ఉపయోగించుకుని నిరుద్యోగులను నమ్మించి డబ్బులు వసూలు చేశారా అనే అంశంపై సమగ్ర విచారణ జరగాల్సి ఉంది. ఇదే తరహాలో మరికొందరి నుంచి కూడా డబ్బులు తీసుకున్నట్లు సమాచారం ఉందని బాధితులు పేర్కొంటున్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి స్వతంత్ర నిర్ధారణ, అధికారిక ధ్రువీకరణ అందుబాటులో లేదు. మధు గతంలో సస్పెన్షన్‌కు గురైనట్లు కూడా సమాచారం ఉన్నప్పటికీ, అందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు, సస్పెన్షన్‌కు గల కారణాలు, ప్రస్తుత సర్వీసు స్థితిపై సంబంధిత పోలీసు శాఖ స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

### జిల్లా పోలీసు కార్యాలయాన్ని ఆశ్రయించనున్న బాధితులు

తమకు జరిగిన అన్యాయంపై ఆధారాలతో జిల్లా పోలీసు కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు బాధితులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. తమ నుంచి తీసుకున్న సొమ్మును తిరిగి ఇప్పించడంతో పాటు, ఆరోపణలు నిజమని తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అవసరమైతే శాఖాపరమైన విచారణ కూడా చేపట్టాలని విజ్ఞప్తి చేయనున్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల ఆశలను ఆసరాగా చేసుకుని డబ్బులు వసూలు చేసే ఘటనలపై అధికారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఈ వ్యవహారంపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి, బాధితుల ఫిర్యాదును స్వీకరించి నిష్పక్షపాతంగా విచారణ చేపడతారా? బాధితులకు న్యాయం జరుగుతుందా? అన్నది వేచి చూడాలి.

## రెండో రోజు సీజేపీ నిరసనలు.. 100 మందికి పైగా అరెస్ట్






న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), విద్యార్థి సంఘాలు చేపట్టిన నిరసనలు రెండో రోజుకు చేరాయి. ఈ నేపథ్యంలో నేడు(ఆదివారం) జంతర్‌మంతర్ వైపు ర్యాలీగా వెళ్తున్న 100 మందికి పైగా ఆందోళనకారులను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిటాస్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఏ నాయకులు, పలువురు విద్యార్థులను పోలీసులు నిర్బంధించారు. పోలీసుల దాడిలో తమ నాయకులు గాయపడ్డారని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. శనివారం జరిగిన నిరసనల్లో 7,000 మందికి పైగా ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. పలువురు ప్రతిపక్ష నేతలు కూడా నిర్బంధానికి గురయ్యారు. ఈ ఘటనలకు సంబంధించి ఢిల్లీ పోలీసులు ఇప్పటికే 20 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. నిరసనకారులు పోలీసులపై దాడి చేసినట్టు, వారి విధులకు ఆటంకం కలిగించడం వంటి అభియోగాలు వారిపై నమోదు చేసినట్లు సమాచారం. నిరసనల సందర్భంగా జరిగిన ఘర్షణల్లో 15 మందికి పైగా భద్రతా సిబ్బంది గాయపడ్డారు.ఠ

## జ్ఞానేశ్ కుమార్‌తో పాటు మోదీ సైతం..: కేజ్రీవాల్



న్యూఢిల్లీ: ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసనలపై పోలీసులు చేపట్టిన చర్యలను ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ తీవ్రంగా ఖండించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీరును హిట్లర్‌తో పోల్చిన ఆయన.. పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌తో పాటు మోదీ కూడా రాజీనామా చేయాల్సిన పరిస్థితి రావొచ్చని హెచ్చరించారు. శనివారం ఢిల్లీలో నిరసనలను అడ్డుకునేందుకు పోలీసులు చేపట్టిన చర్యల్లో యువతులు, న్యాయవాదులు, పాత్రికేయులు సహా పలువురు ఇబ్బందులకు గురయ్యారని కేజ్రీవాల్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. "నిన్న మోదీజీ భయానక పాలనను తలపించేలా వ్యవహరించారు. అన్ని హద్దులూ దాటిపోయారు. హిట్లర్‌ను కూడా వెనక్కి నెట్టేశారు. ఆయన దౌర్జన్యాలకు సంబంధించిన వీడియోలు ప్రతిచోటా కనిపిస్తున్నాయి. యువతులు వేధింపులకు గురవుతున్నారు. న్యాయవాదులను వదల్లేదు.. పాత్రికేయులనూ వదల్లేదు. ఎవ్వరినీ విడిచిపెట్టలేదు. ఈ సారి జ్ఞానేశ్ కుమార్‌తో పాటు మోదీజీ కూడా రాజీనామా చేయాల్సిన పరిస్థితి రాకూడదని అనుకోలేం" అని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు.

### ఢిల్లీలో ప్రముఖుల నిర్బంధాలు

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను వ్యతిరేకిస్తూ, జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ నిరసనకు పిలుపునిచ్చింది. అయితే, పోలీసులు విస్తృతంగా భద్రతా చర్యలు చేపట్టి ఆందోళనను అడ్డుకున్నారు. దేశ రాజధానిలో పలువురు పార్టీ నాయకులు, మద్దతుదారులను అదుపులోకి తీసుకున్నారు. సీజేపీ నాయకులు అభిజీత్ దీప్కే, ఆశుతోష్ రంకా, సౌరవ్ దాస్ కూడా ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న అనంతరం అదుపులోకి తీసుకున్న వారిలో ఉన్నారు. కేజ్రీవాల్‌తో పాటు పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, యూట్యూబర్ ధ్రువ్ రాఠీ, పలువురు ప్రతిపక్ష నేతలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ పరిణామాలపై శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును పోలీసులు అడ్డుకున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. అక్రమ నిర్బంధాలు, రవాణా సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన ధిక్కరణ పిటిషన్‌పై సుప్రీంకోర్టు కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నిరసనకారుల నిర్బంధాలపై కేంద్రం, ఢిల్లీ పోలీసుల స్పందనతో పాటు సుప్రీంకోర్టు తదుపరి చర్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## యాంటీ ఇండియా స్క్రిప్ట్ రాహుల్ - బిజెపి




న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. దేశ ప్రయోజనాల కంటే ఇతర దేశాల వాదనలకు ఆయన ప్రాధాన్యం ఇస్తున్నారంటూ ఆరోపణలు చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలను రాహుల్ ప్రచారం చేస్తున్నారని, విదేశీ జోక్యానికి స్వాగతం పలుకుతున్నారని బీజేపీ నేతలు విమర్శించారు. దేశానికి సంబంధించిన కీలక అంశాలపై విదేశీ వేదికల్లో మాట్లాడటం ద్వారా భారత ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ రాజకీయ వైఖరిని ప్రశ్నిస్తూ, దేశీయ సమస్యలను అంతర్జాతీయ వేదికలపై ప్రస్తావించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే, ఇవన్నీ బీజేపీ చేసిన రాజకీయ ఆరోపణలేనని, వాటిపై రాహుల్ గాంధీ వైపు నుంచి స్పందనను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

### 1984 సిక్కు అల్లర్లను ప్రస్తావిస్తూ విమర్శలు

రాహుల్ గాంధీపై విమర్శల సందర్భంగా బీజేపీ 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల అంశాన్ని కూడా ప్రస్తావించింది. ఆ అల్లర్లకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ, అప్పటి నాయకత్వంపై ఉన్న చారిత్రక వివాదాలను ప్రస్తావిస్తూ, రాహుల్ గాంధీ విదేశాల్లో భారత ప్రజాస్వామ్యం, సిక్కుల హక్కుల గురించి మాట్లాడటాన్ని బీజేపీ ప్రశ్నించింది. లండన్‌లో భారత ప్రజాస్వామ్యంపై, అమెరికాలో సిక్కుల హక్కులపై ఆయన చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ విమర్శలు చేసింది. దేశాలు మారినా, సమస్యలు మారినా రాహుల్ గాంధీ వైఖరిలో మార్పు లేదని, ఆయనదంతా భారత్‌కు వ్యతిరేకంగా సాగే ఒకే రాజకీయ ప్రచారమని ఆరోపించింది. ఈ వ్యాఖ్యలతో బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ విమర్శలు మరోసారి వేడెక్కాయి. రాహుల్ గాంధీ విదేశీ పర్యటనల్లో చేసే వ్యాఖ్యలు, వాటిపై బీజేపీ స్పందనలు రానున్న రోజుల్లోనూ రాజకీయ చర్చకు దారితీసే అవకాశం ఉంది.

## సీఎం రమేష్‌కు గుడివాడ అమర్నాథ్ సవాల్



విశాఖపట్నం: సీఎం రమేష్ ఓడిపోతే ఈ ప్రాంతాన్ని వదిలి వెళ్లిపోవాలంటూ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ సవాల్ విసిరారు. సీఎం రమేష్‌కు ధైర్యం ఉంటే ఎంపీ పదవికి రాజీనామా చేయాలి. ఇద్దరం అనకాపల్లి ఎంపీగా పోటీ చేద్దాం. నేను ఎంపీగా ఓడిపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటా. సీఎం రమేష్ ఓడిపోతే ఈ ప్రాంతాన్ని వదిలి వెళ్ళిపోవాలి. సీఎం రమేష్ దోపిడీలు చూసి ఈ ప్రాంత ప్రజలు భయపడిపోతున్నారు" అంటూ గుడివాడ అమర్నాథ్ వ్యాఖ్యానించారు. సీఎం రమేష్ పోటీ చేయాలంటే 30 పార్టీల మద్దతు అవసరం. నేను వైఎస్సార్సీపి తరపున పోటీ చేస్తాను.. సారా రమేష్‌తో నాకు పోలిక ఏంటి?. గతంలో నా తండ్రి మీద కూడా ఇలాగే సవాల్ చేశారు. అనకాపల్లి పార్లమెంటు పరిధిలో ఏడుగురు టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్న ఎంపీగా తన తండ్రి విజయం సాధించారు. జెడ్పీటీసీగా పోటీ చేస్తే స్క్రూట్నీలో సీఎం రమేష్ పోతాడు. ఆయన ఓటు కడప జిల్లాలో ఉంది. కనీసం అవగాహన లేకుండా సీఎం రమేష్ మాట్లాడుతున్నాడు. అధికారంలో ఉంటే గాడిద కూడా గుర్రంలా కనిపిస్తుంది. ప్రస్తుతం నీ పరిస్థితి అదే." అంటూ అమర్నాథ్ ధ్వజమెత్తారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT.15-603/1, RAJU ROAD, KAMAL NAGAR, ANANTHAPURAMU, ANDHRA PRADESH - 515001.PRINTED AT VSAR PUBLICATIONS 91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL.. RNI NO : APTEL/26/A7631. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

# సోమవారం అన్ని కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### అర్జీల వివరాల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1100



గుంటూరు, అక్టోబర్ 11: (మహి న్యూస్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను సోమవారం జిల్లా, మండల స్థాయిలోని అన్ని కార్యాలయాల్లో పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను నేరుగా పీజీఆర్ఎస్‌లో సమర్పించవచ్చని, మీకోసం వెబ్‌సైట్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ ఫిర్యాదుల స్థితిగతులను తెలుసుకోవడానికి పీజీఆర్ఎస్ టోల్ ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ సూచించారు. [Meekosam.ap.gov.in] (https://meekosam.ap.gov.in) వెబ్‌సైట్ ద్వారా అర్జీలు నమోదు చేసుకొని, వాటి పురోగతిని తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్ సేవలపై తమ అభిప్రాయాలను తెలియజేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ సౌకర్యాన్ని కూడా ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. ప్రజలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు చేయాలి

### సున్నిత, అతి సున్నిత పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి: కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ

గుంటూరు, అక్టోబర్ 11: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అథారిటీ సి.ఎం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై ఆదివారం జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సున్నిత, అతి సున్నిత పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని కలెక్టర్ సూచించారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు అన్ని పోలింగ్ కేంద్రాలను వ్యక్తిగతంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. పోలింగ్ అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వడం, అవసరమైన పోలింగ్ సామగ్రిని సిద్ధం చేయడం, వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రతి అంశంపై అధికారులు స్పష్టతతో ఉండాలని సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు, నిబంధనలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్‌పై క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి

### ప్రజలకు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా పిలుపు

పల్నాడు, అక్టోబర్ 11: (మహి న్యూస్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందుతున్న సేవలపై ప్రజలు తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా కోరారు. పీజీఆర్ఎస్ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచడంతో పాటు ప్రజల సంతృప్తి స్థాయిని మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా, మండల స్థాయి పీజీఆర్ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నోటీసు బోర్డులు, హెల్ప్ డెస్క్‌లు, ఫిర్యాదుల కౌంటర్ల వద్ద కూడా క్యూఆర్ కోడ్‌లను అందుబాటులో ఉంచాలని సూచించారు. పీజీఆర్ఎస్ సేవలు పొందిన వెంటనే ప్రజలు తమ మొబైల్ ఫోన్లతో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అభిప్రాయాలు, సంతృప్తి స్థాయిని నమోదు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రజల స్పందన అధికారిక పీజీఆర్ఎస్ పోర్టల్‌కు చేరుతుందని పేర్కొన్నారు. అర్జీల స్థితిగతులను తెలుసుకోవడానికి టోల్ ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌తో పాటు మండల కార్యాలయాల్లో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో ప్రజలు తమ అర్జీలను సమర్పించాలని, సేవలపై తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేసి మెరుగైన సేవలందించేందుకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో రిటైర్డ్ టీచర్ ఇంట్లో అగ్నిప్రమాదం

### రూ.8 లక్షల ఆస్తి నష్టం అంచనా..

### ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తప్పిన ప్రాణాపాయం





మాచర్ల, అక్టోబర్ 10 (మహి న్యూస్): మాచర్ల పట్టణంలోని రామా టాకీస్ సమీపంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా రిటైర్డ్ ఉపాధ్యాయుడు షేక్ గాలిబ్ సాహెబ్ నివాసంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇంట్లోని విద్యుత్ పరికరాలు కాలిపోగా, సుమారు రూ.8 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. అక్టోబర్ 10వ తేదీ శనివారం మధ్యాహ్నం సుమారు ఒంటి గంట సమయంలో షేక్ గాలిబ్ సాహెబ్ నమాజ్ చేసేందుకు మసీదుకు వెళ్లారు. ఆయన భార్య సైతం తన సోదరుడి ఇంటికి వెళ్లడంతో ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. ఈ క్రమంలో విద్యుత్ మీటర్ వద్ద షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. దీంతో ఇంట్లోని ఏసీలు, టీవీలు, ఇతర విద్యుత్ పరికరాలు కాలిపోయి భారీ నష్టం సంభవించింది. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ ఘటన స్థానికంగా ఆందోళన కలిగించింది. విద్యుత్ మీటర్లు, ఇంటి వైరింగ్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయించుకుంటూ తగిన భద్రతా చర్యలు పాటించాలని ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోంది.

## యానాం కాపు కల్యాణ మండపానికి నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

### ప్రారంభించిన ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం.. కాపు సంఘం నాయకుల సత్కారం



యానాం, మహి న్యూస్, అక్టోబర్ 12: యానాం బైపాస్‌లోని శ్రీ పెద్దిరెడ్డి కృష్ణ వినాయకరావు యానాం కాపు కల్యాణ మండపంలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం ఆదివారం ప్రారంభించారు. యానాం తెలగా (కాపు, బలిజ) అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణ మండపానికి మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు, కార్యక్రమాల నిర్వహణకు విద్యుత్ ఇబ్బందులు లేకుండా ఉండేందుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరానికి కాపు సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఘనంగా సత్కరించారు. తొలుత ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, గొల్లపల్లి వీర్రాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. కల్యాణ మండపానికి మెరుగైన విద్యుత్ సదుపాయం అందుబాటులోకి రావడంతో నిర్వాహకులు, సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నల్లా వెంకన్న, కొండమూరి భాస్కరరావు, హంసాని రామ లక్ష్మణుడు, ఆరిశెట్టి రాజేష్, మోపూరి నాయుడు, పెద్దిరెడ్డి రవికుమార్, విళ్ళ చిన్ని, తోట రాజు, చిక్కాల నరసింహమూర్తి, కామిశెట్టి వేణుగోపాల్, కనకాల రామదాసు తదితర సంఘం ప్రతినిధులు, కాపు నాయకులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



# జాబిల్లిపై వింత కాంతులు?



చందమామ ఒకవైపు నిత్యం వెలుగులతో నిండి ఉంటే.. ఇంకోవైపు చీకట్లోనే ఉంటుందని అంటారు. అయితే నాసా ప్రయోగించిన ఆర్టిమిస్--2 వ్యోమగాములు మాత్రం చీకటితో నిండిన వైపున కూడా అక్కడక్కడా వెలుగులు కనిపించాయని అంటున్నారు. అంతేకాకుండా... చంద్రుడి ఉపరితలంపై ఐదు సూక్ష్మస్థాయి కాంతి మెరుపులను గుర్తించినట్లు నాసా వెల్లడించింది. నాసా తాజాగా విడుదల చేసిన 'ఆర్టెమిస్--2 ప్రిలిమినరీ లూనార్ సైన్స్ రిపోర్టు'లో ఈ వివరాలు ఉన్నాయి. సూక్ష్మస్థాయి కాంతి మెరుపులు ముందు ఒక మిస్టరీలా అనిపించినప్పటికీ, విశ్లేషణ జరిపిన తరువాత వాటిని చిన్న అంతరిక్ష శిలలు (మైక్రో మీటియరాయిడ్లు)గా నాసా గుర్తించింది. చంద్రుడిని అత్యధిక వేగంతో ఢీకొట్టడం వల్ల మెరుపులు పుట్టుకొచ్చాయని నిర్ధారించారు. భూమిలా వాతావరణం లేకపోవడంతో చిన్న చిన్న ఉల్కా శకలాలు కూడా నేరుగా చంద్రుడి ఉపరితలాన్ని ఢీకొంటాయని వివరించారు. అయితే జాబిల్లి నుంచి సుమారు 74 వేల కి.మీ. దూరం నుంచి కూడా వ్యోమాములు వీటిని గుర్తించగలగడం విశేష మని నాసా శాస్త్రవేత్తలు తెలిపారు. చీకట్లోంచి చూస్తూండటం వల్ల వెలుతురు స్పష్టంగా కనిపించి ఉండవచ్చునని అంచనా కట్టారు.

### లో--యాంగిల్ సూర్యకాంతితో...



చంద్రుడిపై చీకటి, వెలుతురులు కలిసే ప్రాంతం 'లూనార్ టెర్మినేటర్' సమీపంలో తాము అక్కడక్కడ వెలుగు దీవులను గమనించామని వ్యోమగామి విక్టర్ గ్లోవర్ చెప్పారు. ఒరియన్ వ్యోమనౌక లూనార్ టెర్మినేటర్ ప్రాంతంలోని హెరట్జ్‌స్ప్రంగ్ బేసిన్, వావిలోవ్ బిలం పరిసరాల్లో పర్వతాలు, బిలాలు, లోయలు మరింత పెద్దవిగా కనిపించాయని ఉపరితలం కూడా కఠినంగా ఉన్నట్లు అనిపించిందని గ్లోవర్ వివరించారు. లో--యాంగిల్‌లో పడుతున్న వెలుతురు ఇందుకు కారణమని నాసా తేల్చింది. నీడలు స్పష్టంగా చూపించాయని వివరించారు. 2026 ఏప్రిల్ 1న చుట్టుపక్కల ప్రాంతాలు చీకటిలో ఉంటే ఎత్తైన ప్రాంతాల్లో మాత్రం అక్కడకక్కడా సూర్యకాంతి కనిపించిందని వ్యోమగాములు చెప్పారు. మిషన్ కమాండర్ రీడ్ వైజ్‌మన్ మాట్లాడుతూ.. టెర్మినేటర్ ప్రాంతం నుంచి చూసినప్పుడు చంద్రుడి చీకటివైపు "ఊహించలేనంత కఠినమైన భూభాగం మాదిరిగా" కనిపించిందన్నారు. ఆకాశంలో సూర్యుడు ఎక్కువ ఎత్తులో ఉన్నప్పుడు కనిపించని కొండలు, లోయలను అక్కడి నీడలు స్పష్టంగా చూపించాయని వివరించారు. 2026 ఏప్రిల్ 1న నింగికి ఎగసిన ఆర్టెమిస్--2 ఏప్రిల్ 6న చంద్రుడి సమీపాన్ని చేరుకుంది. చందమామను చుట్టేస్తూండగా వ్యోమగాములు పరిశీలనలు నిర్వహించి ఏప్రిల్ 10న తిరిగి వచ్చారు. ఈ మొత్తం ప్రాజెక్టులో వ్యోమగాములు సుమారు 800 గిగాబైట్ల సమాచారాన్ని సేకరించగా నాసా దాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. ఇందులో 11 వేలకుపైగా అధిక రెజల్యూషన్ ఫొటోలు, ఎనిమిదిన్నర గంటల ఆడియో, వ్యోమగాములు చేత్తో రాసిన కొన్ని అంశాలు, బొమ్మలు, వ్యాఖ్యానాలు ఉన్నాయి. 1972లో అపోలో--11 ద్వారా మనిషి తొలిసారి జాబిల్లిపైకి అడుగు పెడితే దగ్గరగా వెళ్లింది ఇదే మొదటిసారి. అందుకే నాసా ఈ సమాచారం మొత్తాన్ని యాభై ఏళ్ల కంటే ఎక్కువ సమయం తరువాత మనుషులు ఒక ఉపగ్రహానికి సంబంధించి సేకరించిన సైన్స్ డేటాసెట్ అని అంటోంది.

# ప్రతి శ్వాసకూ మెదడులో ప్రత్యేక ముద్ర!

### శ్వాస తీరుకు, మెదడు తరంగాలకు మధ్య బలమైన అనుసంధానం

### జ్ఞాపకశక్తి, భావోద్వేగాలపై ఉచ్ఛ్వ?ఛ్వస--నిశ్వాసాల ప్రత్యక్ష ప్రభావం

### ప్రాణాయామం లేదా శ్వాస నియంత్రణకు రుజువులు వెతికిన పరిశోధకులు

### యూసీ శాన్ డియాగో పరిశోధనలో ఆసక్తికర విషయాలు వెల్లడి



మనం శ్వాస ద్వారా పీల్చుకునే గాలి ప్రాణాన్ని నిలబెట్టటమే కాకుండా, మెదడు పనితీరును అనుక్షణం నియంత్రిస్తుందని సరికొత్త శాస్త్రీయ పరిశోధనలో వెల్లడైంది. తీసుకునే ప్రతి శ్వాసకూ మెదడులోని విద్యుత్ తరంగాల రూపకల్పనతో విడదీయరాని అనుబంధం ఉంటుందని, ప్రతి శ్వాస మెదడుపై ఒక ప్రత్యేక ముద్రను (న్యూరల్ సిగ్నేచర్) వేస్తుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోరి?నయా శాన్ డియాగో పరిశోధకులు నిర్వహించిన ఈ అధ్యయనం వివరాలు ప్రతిష్టాత్మక 'జర్నల్ ఆఫ్ న్యూరోసైన్స్'లో ప్రచురితమయ్యాయి.

శ్వాస తరంగాల రూపమే కీలకం

సాధారణంగా వైద్య రంగంలో ఒక వ్యక్తి నిమిషానికి ఎన్నిసార్లు శ్వాస తీసుకుంటున్నారనే లెక్కను మాత్రమే పరిశీలిస్తుంటారు. అయితే, ఈ విధానం వల్ల ఎంతో కీలకమైన సమాచారం వెలుగులోకి రాకుండా పోతోందని పరిశోధకులు స్పష్టం చేశారు. మనం శ్వాస పీల్చుకునే లోతు, విడిచిపెట్టే వేగం, శ్వాసల మధ్య ఉండే కొన్ని మిల్లీసెకన్ల విరామం.. ఇలా ప్రతి మార్పూ ఒక ప్రత్యేక తరంగంలా ఏర్పడుతుంది. శ్వాస తరంగాల్లోని ఈ సూక్ష్మ తేడాలు మెదడు కార్యకలాపాల్లో ప్రత్యక్షంగా ప్రతిబింబిస్తాయని పరిశోధకులు కనుగొన్నారు.

పరిశోధన సాగిందిలా..

ఔషధాలకు లొంగని మూర్ఛ వ్యాధి (ఎపిలెప్సీ) చికిత్స కోసం నిరంతర పర్యవేక్షణలో ఉన్న 16 మంది రోగులపై ఈ అధ్యయనం నిర్వహించారు. వారి మెదడు భాగాల్లో అమర్చిన అధునాతన ఎలక్ట్రోడ్ల ద్వారా న్యూరల్ యాక్టివిటీ వివరాలను సేకరించారు. అదే సమయంలో వారు ముక్కు ద్వారా పీల్చుకునే గాలి ప్రవాహం, ఛాతీ, పొట్ట కదలికలను సెన్సర్ల సాయంతో రికార్డు చేశారు. ఈ డేటాను సరిపోల్చగా, శ్వాస రూపం మారిన ప్రతిసారీ మెదడులోని సంకేతాలు కూడా దానికి తగినట్లుగా రూపాంతరం చెందుతున్నట్లు స్పష్టమైంది.

జ్ఞాపకశక్తి, భావోద్వేగాలతో ప్రత్యక్ష లింకు

మెదడులో ఆలోచన, ప్రవర్తన, భావోద్వేగాలు, జ్ఞాపకశక్తిని నియంత్రించే కేంద్రాలపై ఈ శ్వాస తీరు నేరుగా ప్రభావం చూపుతోందని పరిశోధకుల బృందం నాయకురాలు డా. ఈనా కోసిక్--రోస్ తెలిపారు. శ్వాస తీసుకునే సమయంలో మెదడు సమాచారాన్ని గ్రహించే విధానం, శ్వాస వదిలే సమయంలో స్పందించే తీరు భిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. మానసిక ఒత్తిడి, ఆందోళనలను నియంత్రించటానికి ప్రాణాయామం లేదా శ్వాస నియంత్రణ పద్ధతులు ఎందుకు అద్భుతంగా పనిచేస్తాయనే దానికి ఈ ఫలితాలు శాస్త్రీయ ఆధారాన్ని చూపుతున్నాయి.

ఆకస్మిక మరణాలకు అడ్డుకట్ట

ఈ పరిశోధన ఫలితాలు ప్రాణాంతక సమస్యలను ముందస్తుగా గుర్తించేందుకు దోహదపడతాయని శాస్త్రవేత్త డా. బ్రాడ్లీ వాయిటెక్ పేర్కొన్నారు. మూర్ఛ వ్యాధిగ్రస్తుల్లో ఆకస్మిక మరణాలు, పసిపిల్లల్లో నిద్రలోనే శ్వాస ఆగి చనిపోయే సడెన్ ఇన్‌ఫాంట్ డెత్ సింద్రోమ్ వంటి ప్రమాదాలను విశ్లేషించేందుకు ఇది ఉపయోగపడుతుంది. శ్వాస ఆగిపోవటానికి ముందు మెదడు సంకేతాల్లో చోటుచేసుకునే మార్పులను విశ్లేషించి ప్రాణాలను కాపాడే వైద్య పరికరాల రూపకల్పనకు ఈ ఆవిష్కరణ మార్గం సుగమం చేయనుంది.

# మాంసం మార్కెట్లో చికెనే కింగ్..!

### ప్రపంచ మాంసం ఉత్పత్తిలో కోళ్లు,పందులదే 74 శాతం వాటా

### తక్కువ స్థలంలో, కొద్ది రోజుల్లోనే కోతకు వస్తుండటంతో వీటి పెంపకంపైనే రైతుల మొగ్గు

### ఐరాస ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) నివేదిక వెల్లడి



ప్రపంచవ్యాప్తంగా ఒకప్పుడు పచ్చిక బయళ్లలో మేసే పెద్ద పశువులపై ఆధారపడిన మాంసం ఉత్పత్తి రంగం, ఇప్పుడు వేగంగా చికెన్, పందులు వంటి (ఒకే జీర్ణాశయం కలిగిన మోనోగ్యాస్ట్రిక్) చిన్న జీవుల వైపు మళ్లింది. ప్రపంచ వార్షిక మాంసం ఉత్పత్తిలో ఏకంగా 74 శాతం వాటా కోళ్లు, పందులు, టర్కీ కోళ్లు, బాతుల నుంచే లభిస్తోందని ఐక్యరాజ్యసమితి ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) తాజా నివేదికలో వెల్లడించింది. ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేక లు వంటి నెమరువేసే జంతువుల వాటా కేవలం 26 శాతానికే పరిమితమైందని స్పష్టం చేసింది. పశుపోషణ రంగం ప్రపంచ వ్యవసాయ స్థూల ఉత్పత్తిలో 40% వాటాను కలిగి ఉంది. ఇది సుమారుగా 1.8లక్షల కోట్ల డాలర్లకు సమానం.

### ఎందుకీ అనూహ్య మార్పు?

ప్రపంచవ్యాప్తంగా భూమి లభ్యత తగ్గటం, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీల కొరత, వేగంగా మారుతున్న ఆర్థిక సమీకరణాలు ఈ మార్పునకు ప్రధాన కారణాలని ఎఫ్ఏఓ విశ్లేషించింది. పెద్ద జంతువులను మాంసం కోసం పెంచాలంటే విస్తారమైన పచి?చక బయళ్లు, స్థలం అవసరం. కానీ పౌల్ట్రీ రంగం విస్తరణకు చాలా తక్కువ భూమి సరిపోతుంది. అడవుల విస్తీర్ణం తగ్గకుండా చూడాల్సిన అవసరం రీత్యా ఈ మార్పు అత్యంత కీలకమైన అంశంగా మారింది. కోళ్లు తక్కువ దాణాను తిని, అత్యంత వేగంగా బరువు పెరుగుతాయి. దీనివల్ల ఉత్పత్తి వ్యయం తగ్గటమే కాకుండా తక్కువ సమయంలో దిగుబడి చేతికొస్తుంది. గ్రామాల్లో వ్యవసాయ కారి?మకుల లభ్యత ప్రపంచవ్యాప్తంగా తగ్గుతోంది. దీంతో, తక్కువ మందితో సులభంగా నిర్వహించగల బ్రాయిలర్ కోళ్ల పెంపకం వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. మటన్‌తో పోలిస్తే చికెన్ ధరలు మధ్యతరగతి, పేద వర్గాలకు అందుబాటులో ఉండటం ప్రపంచవ్యాప్తంగా వీటి వినియోగాన్ని విపరీతంగా పెంచింది.

### పర్యావరణ అనుకూలత

మానవ కారక ఉద్గారాలలో పశుసంవర్ధక రంగం వాటా 12 శాతం ఉంది. ఇందులో అత్యధిక వాటా ఆవులు, గేదెలు నెమరు వేసేటప్పుడు వెలువడే మీథేన్ ద్వారానే వస్తోంది. దీనితో పోలి?చతే కోళ్ల పెంపకం వల్ల వెలువడే ఉద్గారాల తీవ్రత చాలా తక్కువ కావటం పర్యావరణపరంగా కలిసివచ్చే అంశం. రాబోయే దశాబ్దాల్లో పెరుగుతున్న జనాభాకు తక్కువ వనరులతో చౌకైన జంతు ప్రోటీన్‌ను అందించటంలో కోళ్లు, పందులు, టర్కీ కోళ్లు, బాతులే కీలకంగా మారనున్నాయని ఎఫ్ఏఓ తేల్చిచెప్పింది.

### 67% వెజ్ ప్రొటీనే!

ప్రపంచ ప్రజలకు ఆహార ధాన్యాలు, పప్పుదినుసులు, సోయాబీన్స్, నూనెగింజలు, కూరగాయల ద్వారా 67% వెజ్ ప్రొటీన్ అందుతోంది. పాలు, మాంసం, గుడ్ల రూపంలో 33% జంతు ప్రొటీన్ సరఫరా అవుతోంది. ఈ జంతు ప్రొటీన్‌లో కోళ్లు/పక్షుల మాంసం, గుడ్ల ద్వారా 30%, పంటలతో పాటు ఆవులు, గేదెలు, మేకల రైతువారీ పెంపకం ద్వారా మరో 30%, పందుల పెంపకం ద్వారా 19%, బహిరంగ పచి?చక మైదానాల్లో మేత మేసే పశువుల ద్వారా మరో 12%, ఇతరత్రా 9% ప్రొటీన్ ఆహారం ఉత్పత్తి అవుతోంది.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT 1/702, BEHIND BHARAT PETROL PUMP, GUNTUR, A.P - 522001.PRINTED AT VSAR PUBLICATIONS178/1, ANJANEYA VAGU, KOTHAPETA,VIJAYAWADA (URBAN), N T R, A.P -520001. RNI NO : APTEL/26/A7632. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

## బోయకొండ గంగమ్మ దేవస్థానం నందు శరన్నవరాత్రి ఉత్సవాలు



చిత్తూరు జిల్లా/ బంగారుపాళ్యం మహి న్యూస్ అక్టోబర్ 11. : చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం బోయకొండ గంగమ్మ దేవస్థానం నందు దసరా దేవి శరన్నవరాత్రి సందర్భంగా శ్రీ వజ్రాలు పురం బోయకొండ గంగమ్మ దేవస్థానం ఆలయ ధర్మకర్తలు స్వర్గీయ శ్రీమతి రాధమ్మ శ్రీ కృష్ణప్ప



వారి కుటుంబ సభ్యులు శ్రీమతి చాతుర్య పురుషోత్తం శ్రీమతి దీప గోపి, కొమ్మినేని ఉష నరేష్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శ్రీ మొగిలప్ప స్వామి అమ్మవారిని అభిషేకించిగణపతిహోమంచేసి బాలత్రిపురసుందరిదేవి అలంకరణతో భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలుఅందచేసి అన్నదానం గావించారు. ఉభయదారులుగా అట్లూరి వేణుగోపాల్, జీవా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారినిదర్శించుకొన్నారు. ఈకార్యక్రమంలో శ్రీ వల్లిదేవయానిసమేత సుబ్రహ్మణ్యం స్వామి దేవస్థానం నిర్మాణదాత కంచి విశ్వనాథం, ఆలయకమిటి సభ్యులు శివలింగయ్య, నాగరాజ,రాజేంద్రనాయుడు, రామ్మూర్తి నాయుడు సుబ్బానాయుడు మురళి, వేణుగోపాల్ నాయుడు, కే శంకరయ్య కే తులసి, బాబు, ఆలయ మేనేజర్ మొగిలప్పతదితరులు పాల్గొన్నారు

# తిరుపతి జిల్లాలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

### ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వినతుల స్వీకరణ




తిరుపతి, అక్టోబర్ 11: (మహి న్యూస్): తిరుపతి జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో అక్టోబర్ 12వ తేదీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించి అర్జీలను సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. గతంలో అర్జీలు సమర్పించిన వారు వాటికి సంబంధించిన రసీదులు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. అర్జీలను సమర్పించేటప్పుడు వివరాలను సరిగ్గా నమోదు చేయాలని తెలిపారు. అర్జీల పరిష్కార స్థితిని తెలుసుకోవడానికి 1100 కాల్ సెంటర్ నంబర్‌కు ఫోన్ చేయవచ్చని, అలాగే [meekosam.ap.gov.in](https://meekosam.ap.gov.in) వెబ్‌సైట్ ద్వారా కూడా అర్జీలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. సమస్య పరిష్కారమైనప్పుడు అర్జీదారుల ఫోన్‌కు సందేశం వస్తుందని, ఫోన్‌ను పరిశీలించుకోవాలని సూచించారు. నోటీసులు, ఎండార్స్‌మెంట్లను వాట్సాప్ ద్వారా, రిజిస్టర్డ్ పోస్టు ద్వారా కూడా పంపిస్తామని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్ సేవలపై ప్రజలు తమ అభిప్రాయాలు తెలియజేసేందుకు ప్రభుత్వం క్యూఆర్ కోడ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని కలెక్టర్ తెలిపారు. మొబైల్ ఫోన్‌తో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఫీడ్‌బ్యాక్ పేజీలో వివరాలు నమోదు చేయవచ్చన్నారు. ప్రజల అభిప్రాయాల ఆధారంగా సేవల నాణ్యతను మెరుగుపరిచేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, జిల్లా ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పీజీఆర్ఎస్ వేదికను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## పీజీఆర్ఎస్ సేవలపై క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి

### ప్రజలకు కలెక్టర్ సుమిత్ కుమార్ విజ్ఞప్తి




చిత్తూరు, అక్టోబర్ 11: (మహి న్యూస్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందుతున్న సేవలపై ప్రజలు తమ అభిప్రాయాలు, సంతృప్తి స్థాయిని క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కోరారు. ప్రజలకు మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. జిల్లా, మండల స్థాయిలోని పీజీఆర్ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. పీజీఆర్ఎస్ సేవలు పొందిన ప్రజలు తమ మొబైల్ ఫోన్లతో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, సేవలపై తమ అభిప్రాయాలను నమోదు చేయవచ్చని తెలిపారు. ప్రజలు తెలియజేసే స్పందన నేరుగా అధికారిక పీజీఆర్ఎస్ పోర్టల్‌కు చేరుతుందని వివరించారు. అలాగే, తాము సమర్పించిన అర్జీల స్థితిగతులను తెలుసుకోవడానికి టోల్ ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రజలు క్యూఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాలను తెలియజేసి, మరింత మెరుగైన సేవలు అందించేందుకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## చిత్తూరు కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### పీజీఆర్ఎస్‌తో పాటు రెవెన్యూ క్లినిక్ నిర్వహణ

**చిత్తూరు, అక్టోబర్ 11: (మహి న్యూస్): చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లో అక్టోబర్ 12వ తేదీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ వివరాలతో పాటు సమస్యలకు సంబంధించిన అర్జీలను సమర్పించి, ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్జీల పరిష్కార స్థితిని తెలుసుకోవడానికి మీకోసం కాల్ సెంటర్ టోల్ ఫ్రీ నంబర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.**

# తిరుపతిలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా భారీ ర్యాలీ

### లఘు చిత్రాల పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేత

తిరుపతి, అక్టోబర్ 11: (మహి న్యూస్): అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుపతి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి. బాలకృష్ణ నాయక్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి



ప్రారంభమైన ర్యాలీ ఎస్వీ మెడికల్ కాలేజీ వరకు కొనసాగింది. "బాలికల భద్రత మనందరి బాధ్యత", "బాలిక చదువు దేశానికి వెలుగు", "బాల్యవివాహాలను అరికడదాం -- బాలికల భవిష్యత్తును కాపాడుదాం", "భ్రూణహత్యలను నివారిద్దాం" అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఎస్వీ మెడికల్ కాలేజీ వద్ద మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం డీఎంహెచ్ఓ కార్యాలయ సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ బాలికల పట్ల వివక్ష చూపకుండా అన్ని రంగాల్లో సమాన హక్కులు కల్పించాలని సూచించారు. బాల్యవివాహాలను అరికట్టడంతో పాటు భ్రూణహత్యలను నివారించి, లింగ సమానత్వాన్ని పాటించాలని కోరారు. బాలికల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ కళాశాల విద్యార్థులకు "లింగ వివక్షను మానండి.. ఆడపిల్లలను రక్షించండి"




అనే అంశంపై లఘు చిత్రాల పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో శ్రీకాళహస్తి ఎస్‌వీపీ మెన్స్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు



రూపొందించిన "రేపటి సంతకం" లఘు చిత్రం మొదటి బహుమతి సాధించింది. సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రూపొందించిన చిత్రం రెండో బహుమతి, నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రూపొందించిన చిత్రం మూడో బహుమతి పొందాయి. విజేతలకు మొదటి బహుమతిగా రూ.30 వేలు, రెండో బహుమతిగా రూ.20 వేలు, మూడో బహుమతిగా రూ.10 వేల నగదు బహుమతులను డాక్టర్ బాలకృష్ణ నాయక్ చెక్కుల రూపంలో అందజేశారు. లఘు చిత్రాల తయారీలో పాల్గొన్న విద్యార్థులకు జిల్లా కలెక్టర్, డీఎంహెచ్ఓ సంతకాలతో కూడిన ప్రశంసాపత్రాలను అందించారు. పీసీపీఎన్‌డీటీ కమిటీ సభ్యులు డాక్టర్ మాధవి, కె.వి. రమణ మాట్లాడుతూ జిల్లాలో బాల్యవివాహాలు, భ్రూణహత్యల నివారణకు వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్, స్వచ్ఛంద సంస్థల సిబ్బంది క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రవిశంకర్, డీఎంహెచ్ఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది, కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, పద్మావతి నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



# పతకాలు చెప్పే పాఠం

నువ్వా నేనా అన్నట్టు తలపడే క్రీడోత్సవాల్లో కూడా యుద్ధంలో మాదిరే అవతలి పక్షంపై గెలిచి తీరాలన్న తపన, పట్టుదల ఉంటాయి. ఈర్ష్య, అహంకారం వంటివీ అప్పుడప్పుడు కనబడకపోవు. కానీ దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా చెప్పినట్టు ప్రపంచాన్ని మార్చే శక్తి, కోట్లాదిమందికి ప్రేరణగా నిలిచే సామర్థ్యం, ప్రపంచ పౌరుల్ని ఒక్కటిచేసే సత్తా క్రీడలకే ఉంటుంది. జపాన్‌లోని నగోయాలో రెండు వారాలు కొనసాగి, ఎన్నో అద్భుతాలు ప్రపంచానికందించిన ఆసియా క్రీడల సంరంభం ఆదివారం ముగిసింది. చైనా, జపాన్, దక్షిణ కొరియా క్రీడాకారుల తర్వాత పతక విజేతల్లో మన ఆటగాళ్లది నాలుగో స్థానం. 2023నాటి చైనా క్రీడోత్సవాల్లోనూ మన స్థానం అదే గనుక ఫర్వాలేదన్న అభిప్రాయం




కలుగుతుంది. కానీ సంఖ్యరీత్యా ఈసారి తీసికట్టే. గతంలో 28 స్వర్ణపతకాలు గెలుచుకున్న మన దేశం ఇప్పుడు 21కి సరిపెట్టుకోవాల్సివచ్చింది. వెండి పతకాల్లో చూస్తే 38 నుంచి 28కి పడిపోయాం. కాంస్యంలోనూ అంతే. గతంలో వాటి సంఖ్య 41 కాగా ఇప్పుడు 37. షూటింగ్, ఆర్చెరీ, అథ్లెటిక్స్ విభాగాల్లో అనుకున్న స్థాయిలో స్వర్ణాలు గెలుచుకోలేకపోవటం పెద్ద లోటు. మనం నాలుగో స్థానంలో ఉన్నామన్న మాటేగానీ తొలి ముగ్గురితో పోలిస్తే చాలా దూరంలో ఉన్నట్టు లెక్క. ఉదాహరణకు 341 పతకాలతో చైనా, 269తో జపాన్, 150తో దక్షిణ కొరియా ఉన్నాయి. గతంలో 107 పతకాలు గెల్చుకున్న మన జట్లు ఇప్పుడు 85కి పరిమితమయ్యాయి. మన క్రీడాకారుల ఎంపిక ఈసారి కొంత కఠినంగానే ఉంది. పతకాలు రాబట్టగలిగేవారినే ఎంపిక చేయాలన్న పట్టుదల కనబడింది. అందుకు నిర్దేశించిన గీటురాళ్లు కూడా చిన్నవేం కాదు. గత క్రీడోత్సవాల్లో, ఆసియన్ చాంపియన్‌షిప్, అంతర్జాతీయంగా గుర్తింపుపొందిన ఇతర టోర్నీల్లో తొలి ఆరుస్థానాల్లో నిలిచినవారినే జపాన్ పంపాలన్నది అందులో ముఖ్యమైన ది. గతంలో 'సొంత ఖర్చులతో వస్తాం. అవకాశమీయండి' అని అడిగే క్రీడాకారులు... మన్నించిన అభ్యర్థనలూ తక్కువేం కాదు. ఈసారి కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ అలాంటివారికి ఎట్టి పరిస్థితుల్లోనూ చోటీయరాదన్న కృతనిశ్చయంతో ఉంది. మెరుగ్గా ఆడేవారికి మాత్రమే అవకాశం ఇవ్వాలన్న సంకల్పం మంచిదే. ఇందువల్ల వెళ్లిన క్రీడాకారుల సంఖ్య తగ్గింది. వారిలో ఎక్కువ శాతంమంది మెడల్ రౌండ్ వరకూ వెళ్లగలిగారు. ఎప్పట్లాగే ఇతర ఈవెంట్లతో పోలిస్తే మనకు అథ్లెటిక్స్‌లోనూ, షూటింగ్‌లోనూ ఎక్కువ పతకాలొచ్చాయి. వాటిల్లో కూడా సంఖ్యాపరంగా తగ్గినట్టే. ఆసియా క్రీడోత్సవాలను ఒలింపిక్స్‌కు ముందస్తు పరీక్షలుగా భావిస్తారు. అక్కడ పనితీరునిబట్టే ఒలింపిక్స్‌లో జాతకం ఎలా ఉండబోతోందో చెప్పవచ్చంటారు. చైనా క్రీడోత్సవాలకూ, జపాన్ ఉత్సవాలకూ మధ్య మన దేశం దాదాపు రూ. 98 కోట్లు వ్యయం చేసింది. కానీ సాధించింది చాలా తక్కువే. మనకొచ్చిన స్వర్ణాల్లో కూడా అత్యధికం...అంటే 21లో 13 టీమ్ ఈవెంట్స్‌కు సంబంధించినవే. సమష్టిగా, సమన్వయంతో ఆడి గెల్చుకోవటం ప్రశంసించదగ్గదే అయినా, ఒలింపిక్స్‌లో ఈ ఈవెంట్స్‌కు చోటుండదు. ఆటగాళ్ల పనితీరు మెరుగుపడిందా లేదా అన్నది చూడాలి తప్ప, పతకాలను చూసి అంచనాకు రాకూడదన్న అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి ఆదెల్ సుమారీవాలాతో ఏకీభవించటం కొంత కష్టమే. సగం స్వర్ణాలు క్రికెట్, కబడ్డీ, హాకీ వగైరాలకే వచ్చాయి. ఇవన్నీ జట్టు సమష్టి బలాన్ని చాటాయి... నిజమే. కానీ వ్యక్తిగత ఈవెంట్లలో మరింత మెరుగ్గా ఉంటే ఒలింపిక్స్‌కు అది లాభిస్తుంది. అంతర్జాతీయ సందర్భాల కోసం కఠిన నిబంధనలతో క్రీడాకారుల ఎంపిక, శిక్షణ వగైరాలు మంచిదే. కానీ పాఠశాల స్థాయినుంచే ఈ రంగంలో అర్హులైనవారిని గుర్తించి, స్పోర్ట్స్ అథారిటీలు, అకాడెమీలద్వారా వారిని సానబడితేనే జాతీయ స్థాయిలో మెరికల్లాంటి క్రీడాకారులు రూపొందుతారు. మన బడుల్లో మంచినీరు, మరుగుదొడ్లువంటి మౌలిక సదుపాయాల కల్పనే అంతంతమాత్రం. అలాంటిచోట క్రీడలకు చోటిస్తారని ఆశించటం దురాశే. ఏదేమైనా ఇప్పుడు బయటపడిన లోటుపాట్లను నిశితంగా గమనించి సరిదిద్దుకుంటే 2028లో జరిగే లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్ నాటికి, 2030లో జరిగే దోహా ఆసియా క్రీడోత్సవాలనాటికి మన దేశం మరింత ఉన్నత స్థాయికెదుగుతుంది.

# కాంగ్రెస్ ఒంటెత్తుపోకడ

ఎన్నికల సంఘం(ఈసీ) స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) మాటున చేసిన నిర్వాకంపైనా, ఈ విషయంలో మరో ఇద్దరు కమిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలను బేఖాతరు చేసినట్టు బయటపడిన వైనంపైనా నిరసనలు హోరెత్తుతున్నాయి. ఒకపక్క కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), ఇతర సంఘాలు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ రోజూ ఆందోళన నిర్వహిస్తుండగా మంగళవారం ప్రతిపక్ష ఇండియా కూటమికి చెందిన సుమారు 300మంది ఎంపీలు 9 గంటలపాటు సెంట్రల్ ఢిల్లీలోని పార్లమెంటు నుంచి ఈసీ ప్రధాన కార్యాలయం నిర్వాచన్ సదన్ వరకూ...ఆ తర్వాత ఆకాశవాణి భవన్ ప్రాంగణంలోనూ ర్యాలీ, ధర్నా నిర్వహించాయి. విపక్షాలన్నీ ఏకంకావటం ఇటీవల కాలంలో ఇది రెండోసారి. వ్యవస్థలు వ్యవహరించే తీరుపై కావొచ్చు,



వాటి విధాన నిర్ణయాలపై కావొచ్చు... నిరసన తెలిపే హక్కు ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ ఉంటుంది. ఆ కర్తవ్యాన్ని విపక్షాలు నిర్వర్తించటం హర్షించదగిందే. కానీ నిరుడు నిరసనల్లో పాల్గొన్న తమిళనాడుకు చెందిన డీఎంకే ఎందుకు దూరమైంది? మధ్యలో కొన్నాళ్లు ఇండియా కూటమితో చెలిమి చేసినట్టే కనిపించిన ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) సైతం ఈసారి ఎందుకు మాయమైంది? ఆ రెండు పార్టీల వైఖరులూ మారడానికి కారణం ఇండియా కూటమికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ వ్యవహార శైలే కారణమన్నది రహస్యమేమీ కాదు. ఎక్కడిదాకానో అవసరం లేదు. మంగళవారంనాటి నిరసనలో తొలుత ఉత్సాహంగా పాల్గొన్న తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), కొన్ని ఇతర పార్టీలు సైతం మధ్యలో హఠాత్తుగా అలిగి, దానికి దూరం కావటం కాంగ్రెస్ ఒంటెత్తు పోకడల పర్యవసానమే. పన్నెండేళ్లుగా కేంద్రంలో అధికారంలో కొనసాగుతూ, సంస్థాగతంగా పటిష్టంగా ఉన్న బీజేపీని ఢీకొనటం తనవల్లే సాధ్యమని కాంగ్రెస్ నమ్ముతోంది. మంచిదే. కానీ తాను బాధ్యతాయుతంగా మెలగాలని అది భావించటంలేదు. తమిళనాడు ఎన్నికల్లో ఇండియా కూటమి భాగస్వామ్యపక్షం డీఎంకేతో కలిసి పోటీచేసి, అది ఓడిపోగానే ప్లేటు ఫిరాయించి ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్ నాయకత్వంలోని టీవీకేతో చేతులు కలపటం సూత్రబద్ధ రాజకీయమేనా? తమకు మద్దతు పలికే వర్గాల ఓట్లు ఈసీ అక్రమంగా తొలగించటంవల్లే ఓడిపోయామని ఒకపక్క డీఎంకే చెబుతుండగా, మద్దతుగా నిలవాల్సిన మిత్రధర్మాన్ని కాంగ్రెస్ ఎలా విస్మరించింది? ఆప్ విషయంలోనూ అంతే. కేంద్రంలో తన పాలనలోని అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం నుంచి ఆప్ ఆవిర్భవించింది. కాంగ్రెస్‌కు లోలోన ఆ దుగ్ధ ఉంటే ఉండొచ్చు. పైగా ఢిల్లీలోనూ, పంజాబ్‌లోనూ తన వర్గాల ఓట్లే అది కొల్లగొడుతున్నదన్న ఆగ్రహం సరేసరి. అందుకే దాన్ని బీజేపీ--బీ టీంగా చిత్రిస్తోంది. మరి ఆంధ్రప్రదేశ్‌లో తాను చేస్తున్నదేమిటి? అక్కడ ఎన్డీయే కూటమిలోని టీడీపీతో లాలూచీ పడటాన్ని ఎలా చూడాలి? 2024 ఎన్నికలనాటి అవకతవకలపై పార్లమెంటులో రాహుల్ మాటమాత్రంగానైనా ప్రస్తావించారా? ఈ మౌనం సీఎం చంద్రబాబు కోసం కాదా? ఒకపక్క ఇండియా కూటమికి నాయకత్వం వహించే అర్హత తనకే ఉన్నదంటూ ఇలాంటి తెరచాటు వ్యవహారాలు నడపటం అనైతికమని, తన ఏలుబడిలోని రాష్ట్రాల్లో ఫిరాయింపుల్ని ప్రోత్సహిస్తున్న తీరు కూడా ఈ కోవలోకే వస్తుందని అది గుర్తించటం లేదు. మంగళవారంనాటి ఉదంతంలో నిర్వాచన్ సదన్ దగ్గర ధర్నాకు ముందుగా నిర్ణయించుకున్నాక, చెప్పాపెట్టకుండా ఆకాశవాణి ప్రాంగణంలోకి దూసుకెళ్లటం, ఇతర పక్షాలకు చెప్పకపోవటం ఉద్దేశపూర్వకంగా చేసిందేనని టీఎంసీ, ఇతర పక్షాలూ భావించటంలో తప్పేం లేదు. తాను మాత్రమే బీజేపీపై పోరాడుతున్నానన్న అభిప్రాయం కలిగించటానికే ఇలా చేసిందని ఆ పార్టీలు అలిగాయి. ఈ దశలో చీలిక జాడలు కనబడకూడదని మళ్లీ సర్దుకున్నాయి. పుట్టింది కొన్ని నెలలే అయినా...సంస్థాగతంగా పటిష్టంగా లేకున్నా సీజేపీ పిలుపిస్తే వేలకొలదీ జనం రావటమైనా, ఆప్‌లో కొన్నాళ్లు పనిచేయటం మినహా పెద్దగా రాజకీయ నేపథ్యంలేని అభిజిత్ దీప్కేకు జనం నీరాజనాలు పలకడమైనా ఎందుకో రాహుల్ గ్రహించాలి. సూత్రబద్ధమైన రాజకీయానికి కట్టుబడకపోతే తన మాటెలావున్నా, విపక్షాల ఉద్యమస్ఫూర్తి దెబ్బతింటుందని గుర్తించాలి.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH,
PUBLISHED 9147/1, SRI LAKSHMI NARASIMHA YOGIMAILAVARAM ARCH ROAD, YOGIMAILAVARAM,TIRUPATHI,AP - 517503.A.P .VSAR PUBLICATIONSDOOR NO. 403, PANTA STREET, TIRUPATHI -

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
# మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com



## సోమవారం పీజీఆర్ఎస్‌లో ప్రజల సమస్యల పరిష్కారం

### క్యూఆర్ కోడ్ ద్వారా సేవలపై అభిప్రాయాలు నమోదు చేసుకోవచ్చు

కర్నూలు, అక్టోబర్ 11: (మహి న్యూస్): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపే లక్ష్యంతో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తెలిపారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంతో పాటు రెవెన్యూ డివిజన్, మండల కార్యాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

### క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్‌బ్యాక్

పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలకు అందించే సేవలను మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం క్యూఆర్ కోడ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని కలెక్టర్ తెలిపారు. పీజీఆర్ఎస్‌లో తమకు అందిన సేవలు, సమస్యల పరిష్కారంపై ప్రజలు తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయవచ్చన్నారు. మొబైల్ ఫోన్‌తో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన తర్వాత తెరుచుకునే ఫీడ్‌బ్యాక్ పేజీలో అవసరమైన వివరాలను నమోదు చేసి తమ అభిప్రాయాలను సమర్పించవచ్చని తెలిపారు. ప్రజల నుంచి అందే అభిప్రాయాల ఆధారంగా సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌తో పాటు మండల కార్యాలయాల్లో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించాలని, వాటి పరిష్కారంపై తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయాలని కలెక్టర్ కోరారు.

## సోమవారం పీజీఆర్ఎస్‌లో ప్రజల సమస్యల పరిష్కారం

### క్యూఆర్ కోడ్ ద్వారా పీజీఆర్ఎస్‌పై అభిప్రాయాలు నమోదు చేసుకోవచ్చు

#### జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి




కర్నూలు, అక్టోబర్ 11: (మహి న్యూస్): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపే ఉద్దేశంతో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తెలిపారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంతో పాటు రెవెన్యూ డివిజన్, మండల కార్యాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

### క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్‌బ్యాక్

పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం క్యూఆర్ కోడ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని కలెక్టర్ తెలిపారు. పీజీఆర్ఎస్‌లో తమకు అందిన సేవలు, సమస్యల పరిష్కారంపై ప్రజలు తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని వివరించారు. మొబైల్ ఫోన్‌లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన అనంతరం తెరుచుకునే ఫీడ్‌బ్యాక్ పేజీలో అవసరమైన వివరాలను నమోదు చేసి తమ అభిప్రాయాలను సమర్పించవచ్చని తెలిపారు. ఈ విధానం ద్వారా ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడంతో పాటు, పీజీఆర్ఎస్ సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌తో పాటు మండల కార్యాలయాల్లో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించాలని, వాటి పరిష్కారంపై తమ స్పందనను క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## సోమవారం నగరపాలక సంస్థలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

### ఉదయం 10 గంటలకు కార్యక్రమం.. ఫోన్, వాట్సాప్ ద్వారా ఫిర్యాదుల నమోదు



కర్నూలు, అక్టోబర్ 11: (మహి న్యూస్): కర్నూలు నగరపాలక సంస్థలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరపాలక సంస్థకు చెందిన అన్ని విభాగాల అధికారులు కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. నగరంలోని కాలనీల్లో మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు, పరిశుభ్రత తదితర సమస్యలపై ప్రజలు లిఖితపూర్వకంగా అర్జీలు సమర్పించవచ్చని సూచించారు. కార్యక్రమానికి హాజరుకాలేని ప్రజలు తమ ఫిర్యాదులను 7422992299 నంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా లేదా వాట్సాప్ సందేశం ద్వారా తెలియజేయవచ్చని కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు.

## దుర్గామాత విగ్రహాల నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

### పనులు వెంటనే పూర్తి చేయాలి: కమిషనర్ చల్లా ఓబులేసు



కర్నూలు, అక్టోబర్ 11: (మహి న్యూస్): ఈ నెల 21న నిర్వహించనున్న దుర్గామాత విగ్రహాల నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులను ఆదేశించారు.



ఆదివారం తుంగభద్ర నది వద్ద సంకల్‌బాగ్‌లోని దుర్గామాత ఘాట్‌ను ఆయన పరిశీలించారు. నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఘాట్ వద్ద



పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు, పారిశుద్ధ్య పనులు, మెటల్ రోడ్డు నిర్మాణం, జంగిల్ క్లియరెన్స్ పనులను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. అలాగే విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన క్రేన్లు, విద్యుత్ దీపాలు, వేదిక ఏర్పాటు, తాగునీటి సరఫరా వంటి సదుపాయాలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ఎంఈ మనోహర్ రెడ్డి, డీఈఈలు పవన్ కుమార్ రెడ్డి, నరేష్, ఏఈ జనార్ధన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## కౌంటింగ్ కేంద్రం వద్ద ముమ్మర ఏర్పాట్లు

### ఎన్నికల నిర్వహణకు అన్ని సదుపాయాలు సిద్ధం చేయాలి: కమిషనర్ చల్లా ఓబులేసు



కర్నూలు, అక్టోబర్ 11: (మహి న్యూస్): కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నగర శివార్లలోని అథేనా స్కూల్ వద్ద అవసరమైన ఏర్పాట్లను ముమ్మరం చేయాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులను ఆదేశించారు. ఆదివారం డీఎస్పీ కె.వి. రాఘవేంద్ర, మున్సిపల్ అధికారులతో కలిసి అథేనా స్కూల్‌ను పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్ కేంద్రం, ఎన్నికల సామగ్రి పంపిణీ, పార్కింగ్, మరుగుదొడ్లు, రాకపోకలకు రహదారులు, మెటల్ రోడ్డు నిర్మాణం, జంగిల్ క్లియరెన్స్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పార్కింగ్ సదుపాయాలు, బ్యాలెట్ బాక్సుల భద్రత, రాకపోకల





నియంత్రణ, బారికేడ్ల ఏర్పాటు అంశాలపై డీఎస్పీతో చర్చించారు. స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత, ఎన్నికల సామగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రంలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి, అవసరమైన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, సీఐలు చంద్రబాబు నాయుడు, తేజోమూర్తి, డీసీపీ శబ్బం శాస్త్రి, ఎంఈలు మనోహర్ రెడ్డి, గిరిరాజ్, డీఈఈలు నరేష్, పవన్ కుమార్ రెడ్డి, శ్రీనివాసన్, ఏఈ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## సోమవారం పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం

### ముందుగానే నీటిని నిల్వ చేసుకోవాలి: కమిషనర్ చల్లా ఓబులేసు

కర్నూలు, అక్టోబర్ 11: (మహి న్యూస్): కర్నూలు నగరంలోని మునగలపాడు 15 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రంలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో తాత్కాలికంగా తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ప్రజలు సహకరించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి సరఫరా పునరుద్ధరించే వరకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన మేరకు ముందుగానే నీటిని నిల్వ చేసుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

### కర్నూలు నియోజకవర్గ పరిధిలో..

వాణిజ్య నగర్, బాబా బృందావన్ నగర్, రాజీవ్ నగర్, శిల్పా లైన్, చంద్ బేకరీ లైన్, విద్యా మందిరం స్కూల్ లైన్, నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ లైన్ ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది.



### కల్లూరు పరిధిలో..

ఆదిత్య నగర్, జయ సాయి విల్లాస్, రాధా నగర్, రేణుక నగర్, స్కంద హైబిస్కస్, లోటస్, బీసీ కాలనీ, లెప్రసీ కాలనీ, బోసిరెడ్డి కాలనీ, రాఘవేంద్ర నిలయం లైన్, సోమిశెట్టి కాలనీ, విష్ణు టౌన్‌షిప్, వసుంధర హోమ్స్, నాగేంద్ర నగర్, డబ్ల్యూఎస్ కాలనీ ఈఎల్ఎస్ఆర్, నిర్మల్ నగర్, డీ-మార్ట్ వెనుక ప్రాంతం, సుంకులమ్మ ఆలయం లైన్ ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం ఉండనుంది.

### కోడుమూరు నియోజకవర్గ పరిధిలో..

విజయలక్ష్మి నగర్, సంతోష్ నగర్‌లో కొంత భాగం, రహమత్ నగర్, సమతా నగర్, ఉమర్ నగర్, బాబా ఆఫీసర్స్ కాలనీ, మారుతి రెసిడెన్సీ, మ్యాపుల్ హోమ్స్, మామిడాలపాడు, వసంత రెసిడెన్సీ, విజయ నగర్ కాలనీ, మసా మసీదు ప్రాంతం, కృష్ణారెడ్డి నగర్ ఈఎల్ఎస్ఆర్ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు తాత్కాలిక అంతరాయం ఏర్పడనుంది. సంబంధిత ప్రాంతాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి ముందస్తుగా నీటిని నిల్వ చేసుకోవాలని, పనులు పూర్తయి సరఫరా పునరుద్ధరించే వరకు నగరపాలక సంస్థకు సహకరించాలని కమిషనర్ కోరారు.

## స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

### బ్యాలెట్ పేపర్ల ముద్రణ, ఎన్నికల సామగ్రి పంపిణీపై ప్రత్యేక దృష్టి



కర్నూలు, అక్టోబర్ 11: (మహి న్యూస్): కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులను ఆదేశించారు.



ఆదివారం ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణను సకాలంలో పూర్తి చేయడంతో పాటు, ముద్రణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అనంతరం ఎన్నికల సామగ్రి నిల్వ కేంద్రాన్ని పరిశీలించి, భద్రపరిచిన సామగ్రిని తనిఖీ చేశారు.



ఎన్నికలకు అవసరమైన సామగ్రిని భద్రంగా ఉంచాలని, సంబంధిత అధికారులకు నిర్ణీత సమయంలో పంపిణీ చేసేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి అందుబాటులో ఉండేలా చూడాలని, పంపిణీ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, ఆర్వో వాజిద్, డీసీపీ శబ్బం శాస్త్రి, కార్యదర్శి నాగరాజు, సూపరింటెండెంట్ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

## అగ్రిగోల్డ్ బాధితుల నమోదు కార్యక్రమం రేపటి నుంచి




కర్నూలు, అక్టోబర్ 11: (మహి న్యూస్): అగ్రిగోల్డ్ బాధితుల నమోదు కార్యక్రమం సోమవారం, అక్టోబర్ 12 నుంచి కర్నూలులో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో, ఏపీ టూరిజం హోటల్ సమీపంలోని రామలింగేశ్వర నగర్‌లో జరగనుంది. అగ్రిగోల్డ్ బాధితులు, డిపాజిటర్లు సంబంధిత నమోదు కార్యక్రమానికి హాజరై వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

## రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

### నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి..

### చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి




కర్నూలు, అక్టోబర్ 11: (మహి న్యూస్): జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీ షీటర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, చెడు నడత కలిగిన వారికి కర్నూలు జిల్లా పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమం చేపట్టారు. కౌన్సెలింగ్ సందర్భంగా నేర ప్రవృత్తికి స్వస్తి పలికి, సత్ప్రవర్తనతో జీవించాలని పోలీసులు సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడవద్దని స్పష్టం చేశారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు. జిల్లాలో నేరాలను అరికట్టేందుకు, శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసుల పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.





## ఓర్వకల్లు మండలంలో వైసీపీకి చెందిన

## 30 కుటుంబాలు టీడీపీలో చేరిక

### గౌరు చరిత వెంకట రెడ్డి దంపతుల సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు



కర్నూలు, అక్టోబర్ 11: (మహి న్యూస్): ఓర్వకల్లు మండల కేంద్రానికి చెందిన 30 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. కర్నూలులోని మాధవి నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, వెంకట రెడ్డి దంపతుల సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. పార్టీలో చేరిన వారికి గౌరు దంపతులు టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీలో చేరిన వారిలో ఆశు భాష, పి. షేక్షా వలీ, ఆంజనేయ ప్రసాద్, వెంకటేశ్వర్లు, కే. బాలకృష్ణ, చరణ్, స్వాములు, సురేష్, గణేష్, మహేష్, లావణ్య, రేణుక, మహేశ్వరి, వెంకటేశ్వరి, మా భాష, పి. మదర్ బి, ఇంతియాజ్, మొల్ల మహబూబ్ భాష, సామ్యూల్, నాగయ్య, శశ భాష, పెద్ద పుల్లయ్య, ఆదాము, మోహన్, నజీర్, మధు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, రామ భూపాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, యేసోబు, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కే. పార్వతమ్మ, ఏపీ కార్పొరేషన్ డైరెక్టర్ గంజాయి నాగముని తదితరులు పాల్గొన్నారు.





## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు టీడీపీ స్వాగతం

### జగన్ బీసీలకు ద్రోహం చేశారు: గౌరు చరిత రెడ్డి, గౌరు వెంకట రెడ్డి



కర్నూలు, అక్టోబర్ 11: (మహి న్యూస్): మాధవి నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం బీసీ నాయకుల ఆధ్వర్యంలో పాణ్యం నియోజకవర్గ విస్తృత స్థాయి బీసీ సమీక్ష సమావేశం నిర్వహించారు. పాణ్యం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి సమావేశానికి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా టీడీపీ సీనియర్ నాయకుడు, నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకట రెడ్డి పాల్గొన్నారు. టీడీపీ అధిష్ఠానం పార్టీ పరంగా అమలు చేయనున్న 34 శాతం బీసీ రిజర్వేషన్లను స్వాగతిస్తూ గౌరు దంపతులు మాట్లాడారు. బీసీల రాజకీయ, సామాజిక, ఆర్థిక చైతన్యంతోనే గొడ్డలి పార్టీ రాజకీయ ప్రస్థానానికి ముగింపు పలకవచ్చని వ్యాఖ్యానించారు. ఆవిర్భావం నుంచి బీసీలు టీడీపీ పక్షాన నిలవడాన్ని జగన్ భరించలేకపోతున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు దక్కాల్సిన 16,800 పదవులను దూరం చేసిన బీసీ ద్రోహి జగన్ అని ఆరోపించారు. జగన్ అడ్డుకోకపోయి ఉంటే బీసీలకు ప్రభుత్వ రిజర్వేషన్లు అమలయ్యేవని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం జీవోల ద్వారా బీసీలకు సముచిత రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తుందని తెలిపారు. ఐదేళ్లపాటు బీసీలను అన్ని విధాలుగా అణచివేసిన వైసీపీ నాయకులు ఇప్పుడు వారి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ఈ సమావేశంలో ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కే. పార్వతమ్మ, ఏపీ కార్పొరేషన్ డైరెక్టర్లు రామాంజనేయులు, గంజాయి నాగముని, రామ గిడ్డయ్య, కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి, ప్రభాకర్ యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పి.యు. మాదన్న, జవ్వాజి గంగాధర్ గౌడ్, కాసాని మహేష్ గౌడ్, రాంబాబు, నన్నూరు విశ్వేశ్వర రెడ్డి, విజయుడు, సొసైటీ చైర్మన్లు పర్ల శేఖర్, ఈవీ రమణ, నంద్యాల పార్లమెంట్ ట్రెజరర్ మహబూబ్ భాష, మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ ఎన్వీ రామకృష్ణ, లాయర్ బాబు, శైలజ యాదవ్‌తో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సోమవారం జిల్లా వ్యాప్తంగా

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక పరిష్కార వేదిక

### ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారమే లక్ష్యం: కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల, అక్టోబర్ 11: (మహి న్యూస్): జిల్లా ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు సోమవారం, అక్టోబర్ 12న జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో జిల్లా కలెక్టరేట్‌తో పాటు రెవెన్యూ డివిజన్, మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సమర్పించిన అర్జీలను సంబంధిత అధికారులు పరిశీలించి, నిబంధనల ప్రకారం సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటారని కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ఎవవనిశీయిఖఎ.ఖజూ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని సూచించారు. అర్జీల పరిష్కార స్థితిని టోల్‌ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు. ప్రజలు ముందుగా మండల, రెవెన్యూ డివిజన్ లేదా మున్సిపల్ స్థాయిలో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలను జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌లో సమర్పించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించాలని ఆదేశించారు.

## ఆడపిల్లలను పుట్టనిద్దాం.. బతకనిద్దాం.. ఎదగనిద్దాం

### బాలికల హక్కులపై ప్రజల్లో అవగాహన కల్పించాలి: డీఎంహెచ్‌వో డాక్టర్ శారదాబాయి




నంద్యాల, అక్టోబర్ 11: (మహి న్యూస్): అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది, ఆర్ఆర్ నర్సింగ్ కళాశాల విద్యార్థులతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శారదాబాయి సమావేశం నిర్వహించి, ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలను బతకనిద్దాం, ఎదగనిద్దాం, చదవనిద్దాం అనే నినాదంతో ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. బాలికల హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఆడపిల్ల, మగపిల్లవాడు అనే తేడా లేకుండా సమానంగా చూడాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. బాలికలకు వారి హక్కులు, చట్టాలు, ఆరోగ్యం, విద్యపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఆడపిల్లలు సమాజానికి ఎంతో అవసరమని, తల్లిదండ్రులు వారిని సమానంగా ఆదరించి ఉన్నత చదువులు చదివించాలని కోరారు. చిన్న వయసులో బాలికలకు వివాహాలు చేయడం వల్ల వారు కుటుంబ బాధ్యతలను అర్థం చేసుకోవడంలో, ప్రసవ సమయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని డాక్టర్ శారదాబాయి పేర్కొన్నారు. సమాజంలో ఆడపిల్లల సంఖ్య తగ్గకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. గర్భస్థ శిశువు ఆడపిల్లా, మగపిల్లవాడా అని తెలుసుకునేందుకు స్కానింగ్ కేంద్రాల్లో అడగకూడదని స్పష్టం చేశారు. లింగ నిర్ధారణ చేయడం, వెల్లడించడం చట్టవిరుద్ధమని, ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారికి పీసీపీఎన్‌డీటీ చట్టం-1994 ప్రకారం శిక్షలు ఉంటాయని హెచ్చరించారు.



### విద్యార్థులకు ఫిలిం షో పోటీలు



బాలికల సంరక్షణపై అవగాహన కల్పించేందుకు నంద్యాల జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు 'ఆడపిల్లను బతకనిద్దాం' అనే నినాదంపై ఫిలిం షో పోటీలు నిర్వహించినట్లు డాక్టర్ శారదాబాయి తెలిపారు. పోటీల్లో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన విద్యార్థి బృందాలకు సోమవారం పీజీఆర్ఎస్ భవనంలో జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ రాజకుమారి గణియా చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ ఓ. లలిత, సూపరింటెండెంట్ డాక్టర్ చిట్టిబాబు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జగదీశ్ చంద్రారెడ్డి, డాక్టర్ కాంతారావు నాయక్, డెమో మల్లేపల్లి పామన్న, వైద్యులు, ఆర్ఆర్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT # 87/985-V-P-C-29,VIJAYAPURICOLONY, BESIDE KENDRIYA VIDYALAYA SCHOOL, NEAR NADHYAL CHECKPOST, KURNOOL-518001,KURNOOL DIST, A.P PRINTED AT VSAR PRINTERS, KURNOOL-518001.RNI NO : APTEL/26/A3560. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com
వై ఎస్ ఆర్ కడప జిల్లా
సోమవారం - 12 - అక్టోబర్ - 2026

# పిజిఆర్ఎస్ సేవలపై పై క్యూ.ఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి

**- జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**



కడప, మహి న్యూస్ అక్టోబర్ 11: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) ద్వారా అందుతున్న సేవలపై ప్రజలు తమ స్పందన తెలియజేయాలని జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మరింత పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నిరంతర అభిప్రాయ సేకరణ చేసి ప్రజల సంతృప్తి స్థాయిని మెరుగుపరచడం, వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను కోరుతుందన్నారు. పిజిఆర్ఎస్ కేంద్రాలను సందర్శించే పౌరుల నుండి అభిప్రాయాన్ని సేకరించేందుకు జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాలలో, వివిధ మాధ్యమాల్లో ప్రజల అభిప్రాయ సేకరణకు క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలలో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా క్యూ.ఆర్ కోడ్ ప్రముఖంగా ప్రదర్శించాలని ఆదేశించారు. క్యూ. ఆర్ కోడ్‌ను స్పష్టంగా, కంటికి కనిపించే పరిమాణంలో ముద్రించి, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పౌరులు పిజిఆర్ఎస్ సేవలను పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌ల ద్వారా క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చన్నారు. . ఎక్కువ సంఖ్యలో పౌరులు భాగస్వామ్యం అయ్యే విధంగా నోటీసు బోర్డులు, హెల్ప్ డెస్కులు, ఫిర్యాదుల కౌంటర్లు, తదితర ప్రదేశాల్లో పెట్టాలని కలెక్టర్ సూచించారు. క్యూ.ఆర్ కోడ్ ప్రజల స్పందన అధికారిక పి.జి.ఆర్.ఎస్ పోర్టల్ https://pgrs.ap.gov.in/Home/QRGrievance Feedback కు చేరుతుందని అన్నారు. అర్జీల స్థితిగతులు తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ ను వినియోగించుకోవాలని, తమ అభిప్రాయాలను తెలియజేస్తూ మరింత మెరుగైన సేవలు అందించుటకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోను, మండల కార్యాలయాల్లోనూ నిర్వహించే పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు అందించండి, వాటిపై మీ స్పందన క్యూ.ఆర్ కోడ్ ద్వారా తెలియజేయండి అని కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.




# బీసీలకు 34 శాతం పార్టీ టికెట్లు కేటాయిస్తాం

**బీసీల రాజకీయ ప్రాతినిధ్యంలో రాజీ లేదు**



కడప జిల్లా/జమ్మలమడుగు, అక్టోబర్ 11 (మహి న్యూస్): జమ్మలమడుగు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ బీసీ నాయకులతో కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, జమ్మలమడుగు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో తెలుగుదేశం పార్టీ నిబద్ధతను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం పార్టీ టికెట్లు కేటాయిస్తామని తెలిపారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించే విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. బీసీలకు రాజకీయ అండగా నిలిచిన చరిత్ర తెలుగుదేశం పార్టీకి ఉందని పేర్కొన్నారు. 1987లో 20 శాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టి, 1995లో వాటిని 34 శాతానికి పెంచిన ఘనత తమ పార్టీకే దక్కుతుందని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఉన్నప్పటికీ బీసీలకు దక్కాల్సిన రాజకీయ ప్రాధాన్యం కల్పించేందుకు పార్టీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. బీసీల సాధికారతకు తెలుగుదేశం పార్టీ చేస్తున్న కృషిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు సూచించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుసరించిన వైఖరిని ప్రజలకు వివరించాలని అన్నారు. బీసీల ప్రయోజనాలకు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆయన వైసీపీపై విమర్శలు చేశారు. బీసీ అంటే తెలుగుదేశం పార్టీ.. తెలుగుదేశం పార్టీ అంటే బీసీ"లి అని భూపేష్ సుబ్బరామిరెడ్డి అన్నారు. బీసీలకు రాజకీయంగా మరింత ప్రాధాన్యం కల్పించేందుకు పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకుడు చిన్న గోవిందు, బద్వేల్ నియోజకవర్గ బీసీ నాయకురాలు ఝాన్సీ, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు కొండయ్య, సుంకర నాగేశ్వరరావు, రాష్ట్ర న్యాయ విభాగం నాయకుడు సూర్య పెద్దిరాజు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, వంగల నాగేంద్ర, మండల పార్టీ అధ్యక్షుడు రామయ్యతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# దసరా ఉత్సవాలకు భూపేష్ సుబ్బరామిరెడ్డికి ఆహ్వానం

**చౌడేశ్వరి దేవాలయ కమిటీ ప్రతినిధుల మర్యాదపూర్వక భేటీ**



కడప జిల్లా/జమ్మలమడుగు, అక్టోబర్ 11 (మహి న్యూస్): జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డిని చౌడేశ్వరి దేవాలయ కమిటీ ప్రతినిధులు, నిర్వాహకులు మర్యాదపూర్వకంగా కలిశారు. దసరా దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న ప్రత్యేక పూజలు, అమ్మవారి సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరుకావాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా భూపేష్ సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ శ్రీ దుర్గాదేవి ఆశీస్సులు జమ్మలమడుగు నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. దసరా నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరగాలని ఆకాంక్షించారు.

# నేడు (12వ తేదీ) పీజీఆర్ఎస్ కార్యక్రమం..!

కడప, మహి న్యూస్ అక్టోబర్ 11: జిల్లా ప్రజల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్ సభాభవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు డీఆర్వో మల్లికార్జునుడు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిల్లో కూడా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలతో హాజరై వినతిపత్రాలు సమర్పించాలని కోరారు. అలాగే గతంలో సమర్పించిన అర్జీల వివరాలు తెలుసుకోవడానికి 1100 కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోవచ్చని, పాత అర్జీలకు సంబంధించిన రసీదు ఉంటే వెంట తీసుకురావాలని సూచించారు.

# దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించే ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి: యూఎస్ఎఫ్ఐ



రాయచోటి, మహిన్యూస్, అక్టోబర్ 11 : దసరా సెలవుల్లో పాఠశాలలు, కళాశాలలు నిర్వహించకూడదని జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు వాటిని ఉల్లంఘిస్తూ తరగతులు నిర్వహిస్తున్నాయని యూఎస్ఎఫ్ఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి కమలాకర్ నాయుడు ఆరోపించారు. సెలవులు విద్యార్థులకు విశ్రాంతి కల్పించేందుకు ఉద్దేశించినవని, ఆ సమయంలోనూ తరగతులు నిర్వహించడం వల్ల వారిపై చదువుల ఒత్తిడి పెరుగుతోందని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలను ఉల్లంఘిస్తున్నట్లు వచ్చిన ఆరోపణలపై అధికారులు తక్షణమే స్పందించి, సంబంధిత పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించాలని కోరారు. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు సెలవుల ప్రయోజనం అందేలా చూడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆదేశాలు అన్ని విద్యాసంస్థల్లో అమలయ్యేలా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా సహాయక కార్యదర్శి రాజుతో పాటు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# వెలిగల్లు పాఠశాల ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలి

**- విద్యార్థి సంఘాల డిమాండ్**



రాయచోటి, మహిన్యూస్, అక్టోబర్ 11: గాలివీడు మండలం వెలిగల్లు పాఠశాలకు సంబంధించిన ఘటనపై 11 రోజులకు పైగా గడిచినా పూర్తిస్థాయి విచారణ వివరాలు వెల్లడికాకపోవడంపై విద్యార్థి సంఘాల నాయకులు స్పందించారు. ఆదివారం రాయచోటిలోని డైట్ ప్రాంతంలో నిర్వహించిన సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న, ఏఐఎస్‌బీ జాతీయ అధ్యక్షుడు జయవర్ధన్, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కొమ్మలపాటి సుబ్బారాయుడు మాట్లాడుతూ ఈ ఘటనకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారమైన దృశ్యాలు, వెలుగులోకి వచ్చిన అంశాలపై విద్యాశాఖ అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని కోరారు. మండల విద్యాశాఖ అధికారి నాగరాజు, ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం వ్యవహారానికి సంబంధించి వ్యక్తమైన అభ్యంతరాలపై అన్ని కోణాల్లో పరిశీలన జరగాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం నేరుగా విచారణ చేపట్టారా, బాధిత విద్యార్థిని కుటుంబం నుంచి వివరాలు సేకరించారా అనే విషయాలపై స్పష్టత ఇవ్వాలని నాయకులు కోరారు. సంజాయిషీ నోటీసుల జారీతోనే ప్రక్రియ ముగియకుండా, క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి సంబంధిత వ్యక్తుల వాదనలు, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. విచారణలో వెల్లడయ్యే వాస్తవాల ఆధారంగా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ బాధిత విద్యార్థినికి న్యాయం జరిగేలా విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

# రాయచోటిలో పేదలకు ఉచిత భోజనం.. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిపై లబ్ధిదారుల ప్రశంసలు




రాయచోటి, మహిన్యూస్, అక్టోబర్ 11: పేదల ఆకలి తీర్చాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా అన్నా క్యాంటీన్ల ద్వారా కేవలం ఐదు రూపాయలకే భోజనం అందిస్తుండగా, రాయచోటిలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక చొరవతో పేదలకు ఉచితంగా భోజనం అందిస్తున్నారని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గండికోట సుధాకర్ తెలిపారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అన్నా క్యాంటీన్లు మూతపడటంతో పేదలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నా క్యాంటీన్లను తిరిగి ప్రారంభించి, పేదలకు భోజన సదుపాయం కల్పించడం సంతోషకరమన్నారు. రాయచోటిలో ఉచిత భోజన సదుపాయం ప్రయాణికులు, దినసరి కూలీలు, నిరుపేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు. బయట భోజనం చేయాలంటే గణనీయమైన ఖర్చు అవుతుందని, అలాంటి పరిస్థితుల్లో ఉచితంగా భోజనం అందించడం తమకు ఎంతో ఉపశమనం కలిగిస్తోందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. పేదల ఆకలి తీర్చేందుకు చొరవ చూపుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలుపుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉదయగిరి మస్తాన్ వల్లి పాల్గొన్నారు.

# గ్యార్మి జెండా పండగలో పాల్గొన్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి



కడప జిల్లా/జమ్మలమడుగు, మహి న్యూస్ అక్టోబర్ 11:లి జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు, గడ్డ మసీదు సమీపంలో దర్గా కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు నిర్వహించిన గ్యార్మి (జెండా పండగ) కార్యక్రమంలో కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముస్లిం సోదరులతో పాటు పలువురు నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది.

# దసరా వేళ సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**నకిలీ ఈ-చలాన్ ఏపీకే ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేయవద్దు**

**దసరా సెలవుల్లో ఇళ్ల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి**



కర్నూలు, అక్టోబర్ 11: (మహి న్యూస్): దసరా పండుగ, సెలవుల నేపథ్యంలో సైబర్ మోసాలు, నకిలీ ఈ-చలాన్ ఏపీకే ఫైల్స్, ఇళ్ల దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ సూచించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాహనాలపై ట్రాఫిక్ ఈ-చలాన్లు పెండింగ్‌లో ఉన్నాయంటూ వాట్సాప్, ఎస్ఎంఎస్‌ల ద్వారా వచ్చే గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయవద్దని, వాటి ద్వారా పంపే ఏపీకే ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేయవద్దని హెచ్చరించారు. పోలీసు శాఖ తరపున ఈ-చలాన్ల పేరుతో ఎలాంటి ఏపీకే ఫైల్స్ పంపించరని స్పష్టం చేశారు. చలాన్ వివరాలను అధికారిక ఈ-చలాన్ పోర్టల్‌లో మాత్రమే తనిఖీ చేసుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే 'దసరా బిగ్ సేల్', ఆకర్షణీయమైన పండుగ ఆఫర్ల లింకులను నమ్మవద్దని, వాటిపై క్లిక్ చేసి వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీలు నమోదు చేయవద్దని తెలిపారు. గుర్తుతెలియని ఏపీకే ఫైల్స్‌ను ఇన్‌స్టాల్ చేయడం వల్ల మొబైల్‌లోని వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ వివరాలు సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కే ప్రమాదం ఉందన్నారు. కొనుగోళ్ల కోసం అధికారిక యాప్‌లను మాత్రమే వినియోగించాలని సూచించారు. దసరా సెలవుల్లో ఊళ్లకు వెళ్లేవారు ఇళ్లలో నగదు, బంగారు ఆభరణాలు ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని ఎస్పీ సూచించారు. ఇళ్లకు నాణ్యమైన తాళాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఊళ్లకు వెళ్లే ముందు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు.

# శ్రీశైలంలో శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం

**- అమ్మవారికి శైలపుత్రి అలంకారం, భృంగివాహన సేవ**

శ్రీశైలం, అక్టోబర్ 11 (మహి న్యూస్): ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠమైన శ్రీశైల క్షేత్రంలో శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు ఆదివారం ఉదయం వైభవంగా ప్రారంభమయ్యాయి. పది రోజుల పాటు సాగే ఈ ఉత్సవాలు అక్టోబరు 20వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఆలయ సాంప్రదాయం ప్రకారం శాస్త్రోక్తంగా నిర్వహించే ఈ మహోత్సవాల్లో భాగంగా శ్రీస్వామి అమ్మవార్లకు విశేష పూజలు, అలంకారాలు, నవావరణ పూజలు, వాహన సేవలతో పాటు చండీ, రుద్ర హోమాలు, జప పారాయణాలు జరగనున్నాయి.

## ఆలయ ప్రవేశం - యాగశాల పూజలు

ఉత్సవాల ప్రారంభంలో భాగంగా ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు కాశీనాథ్ చిలువేరు, ప్రత్యేక ఆహ్వానితులు ఆకుల శ్రీనివాసులు, ప్రధాన అర్చకులు, స్థానాచార్యులు, వేద పండితులు మంగళవాద్యాలు, ఫలపుష్పాలతో ఆలయ ప్రవేశం చేశారు. అనంతరం ఉదయం 9.00 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం, గణపతి పూజ, దీక్షా సంకల్పం, కంకణ ధారణ, ఋత్విగ్వరణం నిర్వహించారు. యాగశాలలో అఖండ దీపస్థాపన, వాస్తు పూజ, మండపారాధనలు, చండీ కలశస్థాపన, శ్రీచక్రార్చన, నవగ్రహ జపాలు, చతుర్వేద, చండీసప్తశతి పారాయణాలు జరిపారు. స్వామివారి యాగశాలలోనూ శివ సంకల్పం, రుద్ర కలశస్థాపన పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

## సహస్ర చండీపారాయణ సహిత శతచండీ మహారుద్రయాగం

లోకకల్యాణార్థం, అతివృష్టి-అనావృష్టి నివారణ, పంటలు సమృద్ధిగా పండడం మరియు ప్రజల సుఖశాంతుల కోసం ఈ సంకల్పం తీసుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఈ నవరాత్రులలో మొట్టమొదటిసారిగా సహస్ర చండీపారాయణ సహిత శతచండీ మహారుద్రయాగం నిర్వహిస్తుండడం విశేషం. ఉత్సవాల్లో రోజూ రెండు నుంచి పదేళ్ల లోపు బాలికలకు కుమారీ పూజలు, రుద్రహోమం, చండీహోమాలు జరుగుతాయి.

## నేటి సాయంత్రం కార్యక్రమాలు

ఆదివారం సాయంత్రం అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరగనున్నాయి. రాత్రి అమ్మవారు ద్విభుజాలతో త్రిశూలం, పద్మం ధరించిన 'శైలపుత్రి' రూపంలో దర్శనమివ్వనున్నారు. అలాగే శ్రీస్వామి అమ్మవార్లు ప్రత్యేకంగా అలంకరించిన భృంగివాహనం పై వేంచేసి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. అదనపు మార్పులు లేదా చేర్పులు ఏవైనా ఉంటే తెలియజేయగలరు!

# బంగారుపేటలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

**40 లీటర్ల నాటుసారా, 600 లీటర్ల నాటుసారా ఊట బెల్లం స్వాధీనం**

**నంబర్ ప్లేట్లు లేని 4 ద్విచక్ర వాహనాలు సీజ్**



కర్నూలు, అక్టోబర్ 11: (మహి న్యూస్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కర్నూలు బంగారుపేటలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. కర్నూలు రెండో పట్టణ సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో పోలీసులు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది, ఈగల్ టీమ్ ఎస్ఐ రమేష్ నాయక్, ఎస్ఐలు శివాంజల్, గోపీనాథ్, ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. తనిఖీల్లో 40 లీటర్ల నాటుసారాతో పాటు 600 లీటర్ల నాటుసారా తయారీకి ఉపయోగించే ఊట బెల్లాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే నంబర్ ప్లేట్లు లేని నాలుగు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో అక్రమ కార్యకలాపాల నియంత్రణకు పోలీసులు తనిఖీలు చేపట్టారు.



# నిరాకరణ దీక్ష చేపడుతున్న వీఆర్‌ఏలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేసిన కొత్తపేట ఎమ్మార్వో






(మహి న్యూస్ కొత్తపేట అక్టోబర్ 11): డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలంలో గత 26 రోజులుగా నిరాకరణ దీక్ష చేపడుతున్న వీఆర్‌ఏలకు మద్దతుగా కొత్తపేట ఎమ్మార్వో వై. రాంబాబు, డిప్యూటీ తాసిల్దార్ పి. ఎన్. పద్మ, ఆర్ ఐ. ఆర్ రవిశంకర్ లు తమ మద్దతు తెలిపారు. గత 26 రోజులుగా నిరాకరణ దీక్ష చేపడుతూ జీతాలు లేక కుటుంబ పోషణ గడవకు ఇబ్బంది పడుతున్న వీఆర్‌ఏలను కొత్తపేట బస్టాండ్ సెంటర్లో దీక్షా శిబిరం వద్ద కలిసి వారికి సంఘీభావం తెలుపుతూ నిత్యవసర వస్తువులైన బియ్యం కిరాణా సామాగ్రి కూరగాయలు అందజేశారు.

# ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక శోభకు సాంస్కృతిక కళావైభవం తోడు

ఇంద్రకీలాద్రి, మహి న్యూస్, అక్టోబర్ 11: విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మ వారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఆధ్యాత్మిక ఆనందంతోపాటు మానసిక ఉల్లాసాన్ని అందించేందుకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారి దర్శనార్థం తరలివచ్చిన భక్తులకు సంప్రదాయ సంగీతం, భక్తి గీతాలు, నృత్య ప్రదర్శనలు ఆహ్లాదాన్ని పంచేలా కార్యక్రమాలను రూపొందించారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో నాదస్వరం, తాళం భజన, భక్తి కీర్తనలు, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భారతీయ సంస్కృతి, సంప్రదాయ కళారూపాల విశిష్టతను చాటిచెప్పేలా కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు.

## ఉదయం నుంచి భక్తి సంగీత కార్యక్రమాలు

ఉదయం 10.30 గంటలకు దేవస్థానం నాదస్వర కచేరీతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం ఉదయం 11 గంటలకు పి. ప్రమీల రాణి తాళం భజన, 11.30 గంటలకు ఎం. గార్గి భక్తి కీర్తనలు, మధ్యాహ్నం 12.01 గంటల నుంచి ఎస్. రామాంజనేయులు తాళం భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి భక్తి సంగీతంతోపాటు నృత్య ప్రదర్శనలు వరుసగా కొనసాగాయి. జి. ఆశా కృష్ణారెడ్డి, కె. ప్రజ్వల, సప్పా శివకుమార్, వి. పార్థ సారథి, ఎల్.ఎం. భువనేశ్వరి, సుముఖి శర్మ, ఛి.వి. శివరామకృష్ణ కుమార్ తమ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. అనంతరం అభినయ ఆర్ట్స్ అకాడమీ, శివకళ అభినయ నృత్యాలయం కళాకారులు తమ ప్రదర్శనలతో సాంస్కృతిక వైభవాన్ని చాటారు. కె. గీత మాధవి, ఆర్. శ్రీనివాసరావు, ఎం. నాగ మల్లేశ్వరి తదితరులు నృత్య ప్రదర్శనల్లో పాల్గొన్నారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు వి. మహాలక్ష్మి, ఎం. ప్రశాంతి, భార్గవ కృష్ణ, జి. ప్రియ, సి. వెంకట సీతారామాంజనేయ శర్మ తదితర కళాకారుల నృత్య ప్రదర్శనలు కొనసాగనున్నట్లు పేర్కొన్నారు.

## సంప్రదాయ కళలకు ప్రోత్సాహం

దేవీ నవరాత్రుల సందర్భంగా నిర్వహించే ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతోపాటు భారతీయ కళలు, సంగీతం, నృత్య సంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంచుతాయి. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణంలో సేదతీరే అవకాశం కల్పించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశం. దసరా ఉత్సవాలకు వచ్చే భక్తులకు దర్శనంతోపాటు ఆహ్లాదకరమైన అనుభూతులను అందించేందుకు దేవస్థానం చేపడుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సవాలకు మరింత శోభను చేకూరుస్తున్నాయి.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPADIST, A.PPRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com